ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



ప్రకాశం

జిల్లా వార్తలు

సోమవారం 17, మార్చి 2025



ఇంకెన్నాళ్లో!

పింఛన్లు, రేషన్ కార్డుల కోసం వేలాది మంది ఎదురుచూపులు

- ఉగాది వస్తున్నా యంత్రాంగంలో కదలిక కరువు
- వైసీపీ ప్రభుత్వంలో నిర్దాక్షిణ్యంగా తొలగింపు
- కూటమి ప్రభుత్వం రాకతో చిగురించిన ఆశలు
- ముందడుగు వేయకపోవడంపై ఆశావహుల అసంతృప్తి
- సమాధానాలు చెప్పలేక తెలుగు తమ్ముళ్లలోనూ ఆవేదన

కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో అర్హులతోపాటు గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ దురుద్దేశంతో తొలగించబడిన పింఛన్‌దారులు, రద్దు అయిన తెల్లరేషన్ కార్డుదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తమకు ఒక కార్డు ఇప్పించలేరా? పింఛన్ మంజూరు చేయించలేరా? అని గ్రామస్థాయిలో టీడీపీ నేతలను నిలదీస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా వారు కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో తెలుగు తమ్ముళ్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

టీడీపీ గత ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చింది. అందులో పింఛన్ మొత్తం పెంపు ప్రధానమైనది. అధికారంలోకి రాగానే అర్హులైన వారందరికీ పింఛన్లు, తెల్లరేషన్ కార్డులు ఇచ్చే బాధ్యత తనదంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టగానే ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని పెంచి ప్రతినెలా ఒకటోతేదీనే ఇస్తున్నారు. అంతవరకూ ఈ ప్రభుత్వాన్ని అందరూ అభినందిస్తున్నారు. కానీ పింఛన్లు పొందలేని, తెల్లరేషన్‌కార్డులు లేని అర్హులకు న్యాయం చేసే విషయంలో అడుగు ముందుకు పడలేదు.

గత ప్రభుత్వంలో ఇలా..

గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ వైషమ్యాలతో అర్హులైన వేలాది మంది పింఛన్లు రద్దు చేశారు. తెల్లరేషన్ కార్డులు తొలగించారు. ఇలా వీటిని కోల్పోయిన వారిలో అత్యధికులు వైసీపీయేతర పార్టీలకు చెందిన వారే. చివరకు అప్పటి అధికార వైసీపీలో అసమ్మతి నాయకులుగా ముద్రపడిన వారి అనుచరులకు కూడా నిర్దాక్షిణ్యంగా ఈ సౌకర్యాలను కట్ చేశారు. మరోవైపు బోగస్ పింఛన్లు విచ్చలవిడిగా రాజ్యమేలాయి. ప్రధానంగా వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, కిడ్నీ సమస్య బాధితులకు ఇచ్చే పింఛన్లలో అనర్హులకు అందలం వేశారు. వీటిలో ఎక్కువ ఫింఛన్లు కిందిస్థాయిలోని వైసీపీ నాయకులు దోచుకున్నారు.

వెలుగులోకి కొన్ని బాగోతాలు

వివిధ రకాల పింఛన్‌లపై ఇటీవల ప్రభుత్వం విచారణలో భారీగా బోగ్‌సలు వెలుగు చూశాయి. దీంతో ఈనెల నుంచి కిడ్నీ వ్యాధిగ్రస్థుల్లో అనర్హులకు పింఛన్‌లను కలెక్టర్ నిలిపివేశారు. కానీ ఇతరత్రా పింఛన్‌ల విషయమై జరగాల్సిన విచారణ పూర్తికాలేదు. ఇదే తరహా సమస్య తెల్లరేషన్ కార్డుదారుల్లోనూ ఉంది. ఇటీవల కందుకూరు మండలానికి చెందిన ఒక సీనియర్ టీడీపీ కార్యకర్త... అనారోగ్యానికి గురైన తన భార్యకు చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయించాలని ఒక మంత్రిని కోరారు. వెంటనే ఆయన ఫైల్ సిద్ధం చేయిస్తుండగా సదరు కుటుంబానికి తెల్లరేషన్ కార్డు అమల్లో లేదని తేలింది. తన కార్డు ఎందుకు రద్దు అయిందో కూడా అతనికి తెలియని పరిస్థితి ఉంది. ఇలాంటి వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు.

సంక్రాంతి పోయి ఉగాది వస్తున్నా..



సంక్రాంత్రి నాటికి అర్హులందరికీ పింఛన్‌లు, తెల్ల రేషన్ కార్డులు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఉగాది వస్తున్నా ఆ ఊసే కరువైంది. జిల్లాలో ప్రస్తుతం 2,83,854 మంది పింఛన్‌దారులకు నెలకు రూ.123.63కోట్లను ప్రభుత్వం ఇస్తోంది. నికార్సుగా విచారణ చేయిస్తే అందులో 20శాతంపైగా బోగస్ పింఛన్‌దారులు వెలుగులోకి రావచ్చు. ఆమేరకు అర్హులకు న్యాయం చేసే అవకాశం ఉంటుంది. జిల్లాలో తెల్లరేషన్ కార్డులు 6,37,764 ఉన్నాయి. అనేక మంది కొత్తవాటి కోసం ఎదురు చూస్తున్నారు. బియ్యం, కందిపప్పు విషయం ఎలా ఉన్నా ఆరోగ్య సేవల కోసం వారంతా తెల్లరేషన్ కార్డులు కోరుతున్నారు. ఇలాంటి వారంతా గ్రామగ్రామానా స్థానిక టీడీపీ నాయకులను నిలదీస్తున్నారు. ఆ నాయకులు ఎమ్మెల్యే, ఇతర సీనియర్ నాయకుల వద్దకు వచ్చి ఈ రెండు విషయాలపై అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. త్వరలో ప్రభుత్వం ఈ విషయంలో ముందడుగు వేయకుంటే అర్హులైన ప్రజలు పింఛన్లు, తెల్ల రేషన్ కార్డుల కోసం రోడ్డెక్కే అవకాశం లేకపోలేదు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి స్వామి

అమరజీవి త్యాగం అజరామరం

- మంత్రి డాక్టర్ స్వామి
- ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం అజరామరం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్‌కుమార్‌తో కలిసి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. స్వాతంత్ర్య సమర యోధునిగా కూడా ఆయన పోరాటపటిమ స్ఫూర్తిదాయకమన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ తెలుగు ప్రజలు, దేశం కోసం అమరజీవి చేసిన త్యాగం మరువలేనిదన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు త్యాగమే నాంది అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, సూపర్ బజార్ మాజీ చైర్మన్ తాతా ప్రసాద్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:25 (సోమవారం సాయంత్రం)

సహర్: 4:57 (మంగళవారం ఉదయం)

జడ్పీ పీఠాన్ని కదిలించే దమ్ముందా?



- సీట్లు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొనే నైజం మాది కాదు
- బాలినేనిపై మండిపడిన జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : 'జడ్పీ పీఠాన్ని కదిలించే దమ్ము నీకు ఉందా. ఉంటే చూపించు' అని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సవాల్ విసిరారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో పార్టీ జడ్పీటీసీ సభ్యులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె బాలినేనిపై నిప్పులు చెరిగారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న తనను మార్చాలని నాలుగేళ్ల నుంచి బాలినేని చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. బూచేపల్లి కుటుంబ సభ్యులు అసెంబ్లీ ఎన్నికల్లో గెలవకూడదని 2004 నుంచి 2024 వరకూ అనేక కుట్రలు చేసినా తాము పట్టించుకోలేదన్నారు. తమ కుటుంబంపై బాలినేనికి ఎందుకంత కక్ష ఉందో అర్థం కావడంలేదన్నారు. బాలినేని ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజల్లో తాము సంపాదించుకున్న మంచి పేరుతో వాటన్నింటినీ ఛేదించుకొని ప్రజాక్షేత్రంలో విజయం సాధించామన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని లంచాలు తీసుకునే కుటుంబం తమది కాదని ఆమె స్పష్టం చేశారు. వైవీ సుబ్బారెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి పెట్టిన భిక్షతోనే ఎమ్మెల్యే, మంత్రి పదవులు అనుభవించిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని బాలినేనికి ఆమె సూచించారు. అంతకు ముందు రాజకీయాలలో ఆయన స్థాయి ఏంటో ప్రజలందరికీ తెలుసన్నారు. విలేకరుల సమావేశంలో వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, నాయకులు వేమా శ్రీనివాసులు, కేవీ రమణారెడ్డి, కఠారి శంకర్, దుంపా రమణమ్మ పాల్గొన్నారు.

కమల్‌హాసన్‌ను మించిన నటుడు బాలినేని

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఎద్దేవా

7

ఆకస్మికం.. ఆగ్రహం

జీజీహెచ్‌లో అర్ధరాత్రి కలెక్టర్ అన్సారియా తనిఖీ



స్కానింగ్ విభాగంలో రోగుల రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

- గంటన్నరపాటు వివిధ విభాగాల పరిశీలన
- డ్యూటీ డాక్టర్‌లు విధుల్లో లేకపోవడంపై ఆగ్రహం
- నలుగురికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశం
- రోగులతో మాట్లాడి సమస్యలపై వాకబు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అది జిల్లా కేంద్రమైన ఒంగోలులోని పేదల పెద్దాసుపత్రి (జీజీహెచ్). శనివారం అర్ధరాత్రి సుమారు 10.30 గంటలకు ఒక కారు ఈ ఆసుపత్రికి వచ్చింది. కారు దిగిన ఒక మహిళ నేరుగా క్యాజువాలిటీ వార్డులోకి వెళ్లారు. ఆమెను చూసిన సిబ్బంది ఆశ్చర్యపోయారు. ఉరుకులు పరుగులు పెట్టారు. కారణం ఆ కారులో వచ్చింది సామాన్య మహిళ కాదు. కలెక్టర్ తమీమ్ అన్సారియా! జీజీహెచ్‌లో రోగులకు అందుతున్న సేవలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వచ్చిన ఆమె ఆసుపత్రిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై సీరియస్ అయ్యారు. రోగులకు సేవలందించే విషయంలో అలసత్వం చూపితే సహించేది లేదని ఘాటుగా హెచ్చరించారు.

గంటన్నరపాటు విస్తృత తనిఖీలు

ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చేసిన జబ్బుకు కలెక్టర్ అన్సారియా చికిత్స ప్రారంభించారు. శనివారం రాత్రి వైద్యశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. గంటన్నరపాటు వివిధ విభాగాలను పరిశీలించారు. రిజిస్టర్లను చూశారు. అత్యవసర విభాగమైన క్యాజువాలిటీలో డ్యూటీ డాక్టర్లు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి స్థానంలో అక్కడ మెడికల్ పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్‌లు, నర్సులు ఉండటాన్ని కలెక్టర్ ప్రశ్నించారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వచ్చే రోగులకు ఎవరు వైద్యం చేస్తారు? అని ప్రశ్నించారు. పీజీ విద్యార్థులు వైద్యం చేయకూడదు కదా అని ఆమె ప్రశ్నించడంతో వారు బిక్కమొఖం వేశారు. అనంతరం సీటీ స్కాన్, ఎక్స్‌రే, ఎంఆర్ఐ స్కాన్ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. రిపోర్టులు ఎప్పుడు ఇస్తున్నారని ప్రశ్నించారు. 24గంటల్లో ఇస్తున్నామని అక్కడ ఉన్న సిబ్బంది చెప్పగా.. 'రోగులు దూర ప్రాంతం నుంచి వస్తారు. ఒకరోజు తర్వాత ఇస్తే ఎలా? ఒక గంటలో ఇవ్వాలి' అని ఆదేశించారు.

డ్యూటీలో లేని వైద్యులకు నోటీసులు

అత్యవసరమైన క్యాజువాలిటీలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, గైనిక్ వైద్యులు 24 గంటలూ విధుల్లో ఉండాలి. కానీ కలెక్టర్ తనిఖీ సమయంలో ఒక్కరు కూడా అక్కడ లేరు. దీనిపై ఆమె సీరియస్ అయ్యారు. ఆమె ఆదేశాల మేరకు జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ నామినేని కిరణ్ నలుగురి వైద్యులకు ఆదివారం షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

వైద్య సేవలపై ఆరా

కలెక్టర్ అన్సారియా వార్డులకెళ్లి రోగులను కలిశారు. వారితో మాట్లాడారు. 'మందులన్నీ అందుతున్నాయా? డాక్టర్లు, నర్సులు సకాలంలో వచ్చి చూస్తున్నారా? వార్డుల్లో తాగునీరు సక్రమంగా ఉంటుందా?' అని అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని పలువురు ఆమె దృష్టికి తెచ్చారు. తాగునీటి ఇబ్బందులతోపాటు మరికొన్ని సమస్యలను వారు కలెక్టర్‌కు వివరించారు.

'ఆంధ్రజ్యోతి' కథనం అక్షరాల నిజం

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పరిస్థితిపై ఆంధ్రజ్యోతిలో గత నెల 12వ తేదీన 'జీజీహెచ్‌కు జబ్బు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. క్యాజువాలిటీ వైద్యులు ఉండకపోవడం, వైద్య విద్యార్థులతో మొక్కుబడి వైద్యసేవలు, ఇతరత్రా సేవల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడంపై కథనంలో పేర్కొంది. ఇప్పుడు కలెక్టర్ పర్యటనలో ఇవన్నీ వెలుగు చూశాయి. ఆంధ్రజ్యోతి కథనం అక్షర సత్యం అని నిరూపితమైంది.



ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

నేటి నుంచి పది పరీక్షలు

- పకడ్బందీ ఏర్పాట్లు
- రెగ్యులర్ విద్యార్థులు 29,602... 'ఓపెన్' 1,564 మంది
- 15 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు
- డీఈవో కిరణ్‌కుమార్ వెల్లడి

ఒంగోలు విద్య, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. అందుకోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం..

పరీక్షలను మొదటిసారి ఎస్ఎస్‌సీ బోర్డు, ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఒకే తేదీల్లో, ఒకే పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నాయి. ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్షలకు 29,602 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వారికోసం 183 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు జరుగుతుంది. ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలకు 1,564 మంది విద్యార్థులు హాజరవుతుండగా వారి కోసం 23 కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెగ్యులర్, ఓపెన్ విద్యార్థులకు వేర్వేరుగా గదులు కేటాయిస్తారు. కాపీయింగ్‌ను నిరోధించేందుకు 15 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

కేంద్రాల పరిశీలన

ఒంగోలు నగరంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఆదివారం డీఈవో కిరణ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం స్థానిక సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో స్క్వాడ్ అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు.

ప్రశ్నపత్రాలకు ఏడు అంకెల కోడ్

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాల భద్రతకు ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టింది. లీకేజీని అరికట్టేందుకు, ఎవరైనా తప్పు చేస్తే వెంటనే పట్టుకొనేందుకు ప్రతి ప్రశ్నపత్రం మీద ఏడు అంకెల కోడ్ నంబరును ముద్రించారు. ఆయా జిల్లాలకు కేటాయించిన ప్రశ్నపత్రాలపై ముద్రించిన కోడ్ నంబరు వరుస ప్రకారం ఆయా పరీక్ష హాలుకు, అక్కడి విద్యార్థులకు వరుస క్రమంలో ఇస్తారు. ఏ విద్యార్థికి ఏ నంబరు కోడ్ ప్రశ్నపత్రం కేటాయించింది ఇన్విజిలేటర్ నమోదు చేస్తారు. విద్యార్థి కూడా తన ప్రశ్నపత్రంపై ఉన్న ఏడు అంకెల కోడ్ నంబరును జవాబు పత్రంలో నమోదు చేయాల్సి ఉంటుంది.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఒంగోలు క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల కోసం ఏర్పాటు చేసిన 183 కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జెరాక్స్ సెంటర్లు తెరవకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా చిన్న ఘటన జరిగినా 100, 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

పేరు రాస్తే ఫెయిల్ అయినట్టే..

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు పొరపాటున తన పేరు కానీ, తాను చదువుతున్న పాఠశాల పేరు కానీ జవాబు పత్రంపై రాస్తే ఫెయిలైనట్లే. పరీక్షలను బార్ కోడింగ్ విధానంలో నిర్వహిస్తున్నారు. పరీక్షా కేంద్రాల చీఫ్‌లు కూడా సంతకం చేయడంకానీ, సీలు వేయడం కానీ చేయకూడదు.

పట్టించుకోండి సారూ..!

● కూలిపోయేలా ఉన్న కరెంటు స్తంభం


విరిగి కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

నగరంలోని మస్తాన్ దర్గా సెంటర్‌లోని ఓ విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. సిమెంట్ స్తంభం అడుగు భాగం పూర్తిగా పగిలిపోయి, ఇనుప చువ్వలపైనే నిలబడి ఉండటంతో అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రోజువారీ కూలీ పనుల నిమిత్తం వందలాది మంది ప్రతి రోజు అక్కడకు చేరుకుంటారు. నిత్యం ఈ మార్గం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇదే విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా, ట్రాఫిక్ పోలీసుల సహకరిస్తే తాము మార్చడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతుండగా, ట్రాఫిక్ పోలీసులు మాత్రం తమకు ఎలాంటి సంబంధం లేదని, మా శాఖ సమస్య కాదని వెల్లడించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ, సమన్వయం లేకుండా వ్యవహరిస్తున్న విద్యుత్, ట్రాఫిక్‌శాఖల తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పదే పదే విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కరెంటు స్తంభాన్ని నూతనంగా ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

మంత్రిని కలిసిన కనిగిరి డీఎస్పీ


మంత్రి స్వామికి మొక్కను అందిస్తున్న డీఎస్పీ ఈశ్వర్‌యశ్వంత్

టంగుటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి నూతన డీఎస్పీగా నియమించబడిన ఈశ్వర్‌యశ్వంత్ ఆదివారం తూర్పునాయుడు పాలెంలోని మంత్రి క్యాంపు ఆఫీస్‌లో మంత్రి డాక్టర్ శ్రీబాలవీరాంజనేయస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. విధుల నిర్వహణలో తరతమ బేధం లేకుండా జాగ్రత్తగా ఉండాలని మంత్రి ఈ సందర్భంగా డీఎస్పీకి సూచించారు.

కుటుంబ సాధికార సారథులను నియమించండి

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్


సభ్యత్వ కార్డులను అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 60ఓటర్లకు ఒకరిని కుటుంబ సాధికారక సారథులను నియమించాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆదేశించారు. ఆయా గ్రామాల్లో పార్టీ సభ్యత్వం తీసుకున్న పార్టీ కార్యకర్తలకు కార్డులు అందజేయాలని చెప్పారు. ఆదివారం ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తన కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమఫలాలు అర్హులకు అందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, మద్దినేని హరిబాబు, తేళ్ల మనోజ్, మన్నం ప్రసాద్, మండవ జయంత్‌బాబు, వేల్పుల శ్రీను, వరప్రసాద్, సాయిబాబా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బల ప్రదర్శన పోటీల్లో అపశ్రుతి

● బండలాగుతూ ఎద్దు మృతి


అంత్యక్రియల కోసం ఎద్దు కళేబరాన్ని బండిమీద తీసుకెళ్తున్న స్థానికులు

గిద్దలూరు టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మండలం నరవ గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలలో ఆదివారం అపశ్రుతి చోటుచేసుకొంది. మార్కాపురం మండలం బొడిచెర్ల గ్రామానికి చెందిన నక్షత్రరెడ్డి ఎడ్ల జత బండలాగుతుండగా ఒక ఎద్దు కూప్పకూలి అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ఎద్దు మృతితో ఆప్రాంతంలో ఒక్కసారిగా విషాదం అలముకుంది. రైతు నక్షత్రరెడ్డితోపాటు పశుపోషకులు సైతం కన్నీరు పెట్టుకున్నారు. అక్కడికి సమీపంలోనే ఆ ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహించారు. నరవ గ్రామస్థులు అప్పటికప్పుడు రూ.3.22 లక్షలను విరాళాలుగా సేకరించి రైతు నక్షత్రరెడ్డికి అందజేశారు.

చలివేంద్రాలు ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవిసుధాకర్

నాగులుప్పలపాడు, మార్చి 16 (ఆంధ్ర జ్యోతి): వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలోని బొడ్డురాయి సెంటర్ వద్ద కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని క్లబ్ జోన్ చైర్మన్ దేసు రవిసుధాకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య గ్రామమైన ఉప్పుగుండూరులో పలు గ్రామాల నుంచి ప్రజల ఇక్కడకు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పార్కు వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమరా వేణు, పులకణం రాజేష్, కొంజేటి జలంధర్, తెల్లప్రోలు శ్రీరాములు, కిషోర్, శామ్యూల్, గ్రంథపాలకులు ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో..



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు చీమకుర్తి పోలీస్ స్టేషన్ సమీపంలో చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూర్వవిద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులైన మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి, ముప్పూరి రంగారావు, గోపవరపు శ్రీనివాసరావు, వెంకట్రావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, మారం శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్, గోనుగుంట శ్రీనివాసరావు, రామ్మోహన్, అప్పనబోయిన శ్రీనివాసరావు, రత్నం, బొమ్మల చినఅంకయ్య, హెబ్సిబా పాల్గొన్నారు.

మళ్లీ మొరాయించిన మోటార్లు

● పలు కాలనీల్లో నీటి కోసం పడిగాపులు


ఫిల్టర్‌బెడ్‌లో ఆగిపోయిన మోటార్లు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : నగరంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. వేసవిలో నీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు కరువయ్యాయి. శనివారం నగరంలోని పలు కాలనీలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలోని రెండు తాగునీటి మోటార్లు మొరాయించడంతో ఆరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి నగరంలోని జక్రయ్యా నగర్, సిద్ధాంతి బజారు. మామిడిపాలెం, జక్రయ్య ఆసుపత్రి ఏరియా, దేవుడుచెరువు, సంజయ్‌గాంధీ కాలనీలకు నీటి సరఫరా నిలిచిపోయింది. అయితే గతంలో ఈ ఫిల్టర్ బెడ్‌లో రెండు మోటార్లు ఉండగా, నెల క్రితం ఒకటి కాలిపోయినట్లు సమాచారం. అయితే దానిని మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేయడంతో, ప్రస్తుతం పనిచేస్తున్న మరో మోటారు రిపేరుకు వచ్చింది. దీంతో ఒక్కసారిగా రెండు మోటార్లు ఆగిపోవడంతో నగరంలోని సుమారు ఆరు కాలనీలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఆయా కాలనీల ప్రజలు గంటల తరబడి నీటి కోసం ఎదురు చూసినా ఫలితం లేకపోయింది. వాస్తవానికి ఆయా కాలనీలకు శుక్రవారమే నీటి సరఫరా జరగాల్సి ఉండగా ఒక రోజు ఆలస్యంగా విడుదల చేశారు. అయితే మోటార్లు పనిచేకపోవడంతో తాగునీటి సరఫరా ఆగింది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా ప్రత్యామ్నాయంగా హిల్‌టవర్ ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి నీటిని సరఫరా చేశారు. ఆదివారినికి కూడా మోటార్ల మరమ్మతులు పూర్తి కాలేదు. కాగా గత నెల రోజులుగా నగరంలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతుండగా, ముందస్తు చర్యలు లేకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటి అవసరాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

అమరజీవి త్యాగాన్ని కొనియాడిన మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ● తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన అధ్యాపకులకు సన్మానం


తెలుగు అధ్యాపకులను సత్కరించిన మారిటైంబోర్డు చైర్మన్ సత్య

కొండపి, మార్చి16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవని, ఆయన సేవలు అజరామరం అని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ అన్నారు. ఆదివారం చెన్నైలోని అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవన నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన శ్రీరాములు 124వ జయంతి కార్యక్రమంలో సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తమిళనాడులో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన పలువురు తెలుగు అధ్యాపకులను సన్మానించారు.

వైసీపీ కార్యాలయంలో..

ఒంగోలు కలెక్టరేట్: స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబులు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కఠారి శంకర్, కేవీ.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కేవీవీ.ప్రసాద్, బొట్లా సుబ్బారావు, ఇమ్రాన్‌ఖాన్, దుంపా చెంచిరెడ్డి, వేమా శ్రీనివాసరావు, రవణమ్మ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

ఒంగోలు క్రైం: స్థానిక ఎస్పీ కార్యాలయం ఆవరణంలో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎస్పీ దామోదర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐలు నాగరాజు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..


ఆర్యవైశ్యుల నివాళి

సంతనూతలపాడు: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు స్థానిక ఆర్యవైశ్యమందిరం, బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు, మహాత్మగాంధీ విగ్రహాలకు పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వీవీ.శేషారావు, జిల్లా సహాయకార్యదర్శి వి.నాగేంద్రప్రసాదరావు, మహిళా అధ్యక్షులు సీహెచ్.చంద్రావతి, జిల్లా ప్రతినిధి జీఎల్.ప్రసాదరావు, మహిళాక్లబ్ సభ్యులు, ఆర్యవైశ్యమందిరం నాయకులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..


నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మద్దిపాడు: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను అర్పించారని విశ్రాంత ఉద్యోగి పీవీ.రాఘవరావు అన్నారు. ఆదివారం మద్దిపాడు నటరాజ కళాకేంద్రంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గంటా కోటేశ్వరరావు, నేలటూరి సత్యనారాయణ, ఈమని సుబ్బారావు, గంగిశెట్టి నరసింహారావు, కాకుమాను సుబ్బారావు, దిద్ది రామారావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

15 రోజులే గడువు.. రూ.10 కోట్లు లక్ష్యం..!

● పన్నుల వసూలు వేగవంతం చేయాలి
● నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశం


సచివాలయ సెక్రటరీలతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : "నగర అభివృద్ధికి, 16వ ఆర్థిక సంఘ నిధులు మంజూరుకు ప్రజలు చెల్లించే పన్నులే ఆధారం. గడువు మరో పదిహేను రోజులే ఉంది. ప్రతి ఒక్కరూ కష్టపడాలి. పెండింగ్ ఉన్న బకాయిలు వసూళ్ళపై దృష్టి సారించాలి" అని నగర కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆదివారం స్థానిక కమిషనర్ చాంబర్‌లో కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నులు వసూళ్ళలో కొంతమేర వెనుకబడి ఉన్నామని తెలిపారు. లక్ష్యాలు చేరుకోవడానికి ప్రతి ఒక్కరు క్షేత్రస్థాయిలోకి వెళ్ళాల్సి ఉందన్నారు ఉదయం 8 నుంచి రాత్రి 8వరకు కష్టపడితే తప్ప ఫలితాలు సాధ్యపడవని చెప్పారు. అదేవిధంగా పన్నుల వసూళ్ళకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మొబైల్ వాహనం ద్వారా ప్రచారాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. అలాగే వసూళ్ళపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రతిరోజు, సెలవు రోజుల్లో కూడా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుతో పాటు పన్నుల వసూళ్ళపై ఆర్‌డీఎంఏ ప్రతిరోజు టెలీకాన్ఫరెన్స్ ద్వారా నివేదికలు కోరుతున్నారని వివరించారు. ప్రత్యేకించి కార్పొరేషన్‌కు ప్రభుత్వపరంగా మంజూరు కావాల్సిన 16వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావాలంటే పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ప్రజల్లో వడ్డీ మినహాయింపు ఉంటుందనే అపోహ ఉందని, అలాంటిదేమీ లేదని విషయాన్ని వివరించాలని కోరారు. అలాగే లక్ష్యాలు పూర్తయ్యేవరకు సిబ్బందికి ఎలాంటి సెలవులు మంజూరు వీలుపడదని స్పష్టం చేశారు. 15 రోజుల్లో రూ.10 కోట్లు వసూలు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. ఆర్వో విజయ్‌భాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కళ్యాణి, క్రాంతికుమార్, నిరూప్, అడ్మిన్‌లు పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

● నేటి నుంచి ప్రారంభం
● కేంద్రాలను సిద్ధం చేసిన అధికారులు


చీమకుర్తి జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లలో ఉన్న ఉపాధ్యాయులు

చీమకుర్తి, మార్చి16(ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్షలను సోమవారం నుంచి పకడ్బందీగా నిర్వహించటానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చీమకుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నతపాఠశాల, విద్యానికేతన్, గురుకుల పాఠశాల, మనశశి పాఠశాలలు మొత్తం ఐదు కేంద్రాలలో 980మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఎంఈవోలు నరసింహారావు, శివాజీ ఆదివారం తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా బెంచీలు, తాగునీరు, వైద్యసదుపాయం వసతులు కల్పించటం జరిగిందన్నారు. ఆర్టీసీ బస్సులలో హాల్‌టిక్కెట్ చూపించి ఉచితంగా విద్యార్థులు ప్రయాణం చేయవచ్చని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది కేటాయింపు పూర్తి అయినట్లు వారు పేర్కొన్నారు.

సంతనూతలపాడు: మండలంలో ఐదు కేంద్రాల్లో సోమవారం నుంచి జరిగే పదో పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేట్‌పాఠశాలలకు చెందిన 1,100 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-45 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు అరగంటమందే చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది పరీక్షలు రోజు మార్చి రోజు జరగనున్నాయి. ఎస్‌ఐ వి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

నాగులుప్పలపాడు: మండల పరిధిలోని ఐదు పరీక్షాకేంద్రాలలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో తిరుమలశెట్టి రవి ఆదివారం తెలిపారు. బి.నిడమానూరు హైస్కూల్, ఉప్పుగుండూరు జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, అమ్మనబ్రోలు జడ్పీ హైస్కూల్, గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాలలో 656 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, బెంచీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మద్దిపాడు: పదో తరగతి పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో ఆంజనేయులు తెలిపారు. సోమవారం ప్రారంభం కానున్న ఈ పరీక్షలను పర్యవేక్షించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామని, పరీక్ష సామగ్రిని సరఫరాకు రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం ప్రభుత్వం కల్పించిందని ఆయన చెప్పారు.

గుండ్లకమ్మ గేట్ల పనులు తక్షణం పూర్తి చేయాలి : సీపీఎం

మద్దిపాడు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లు పాడైపోయి మూడేళ్లు దాటుతున్న ఇప్పటికీ పూర్తిస్థాయిలో కొత్తవి పెట్టలేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కాలం సుబ్బారావు అన్నారు. ప్రజా చైతన్యయాత్రలో భాగంగా ఆదివారం గుండ్లకమ్మ డ్యాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు గేట్ల పనులు త్వరగా పూర్తి చేయాలని, ఎడమ కాలువలో జంగిల్ క్లియర్ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, ఉబ్బా వెంకటేశ్వర్లు, వెంకట రామిరెడ్డి, ఖాసీం పాల్గొన్నారు.

కొప్పోలు చెరువును సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌గా మార్చాలి

ఒంగోలు(రూరల్): కొప్పోలు చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చాలని సీపీఎం నాయకులు కోరారు. ఆదివారం వారు కొప్పోలులో పర్యటించి గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామ పరిధిలోని 65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌గా మార్చాలని చెప్పారు. కొప్పోలు రోడ్డుకు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జి.రమేష్, తంబి శ్రీనివాసులు, హుసేన్, దారా వెంకటేశ్వర్లు, కె.శ్యాము, రవి, అంజనేయులు, హనుమంతరావు, వెంకట్రావు, కొప్పోలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే యాత్రలు

నాగులుప్పలపాడు: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రజా చైతన్యయాత్రలను చేపట్టినట్లు సీపీఎం రాష్ట్ర నాయకుడు జాలా అంజయ్య తెలిపారు. ఉప్పుగుండూరులోని దిన్నెమీద చింతతోపు కాలనీలో ఆదివారం రాత్రి పర్యటించి అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకొన్నారు. కార్యక్రమంలో జె.జయంతిబాబు, తూబాటి శ్రీకాంత్, చీరాల ప్రభుదాస్, యు.వెంకటేశ్వర్లు, కె.శ్రీను, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటకు సత్య పరామర్శ

కొండపి, మార్చి16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని చెన్నైలోని ఆయన కార్యాలయంలో సత్య ఆదివారం మధ్యాహ్నం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, బాగోగులు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

19న మల్లవరం దేవస్థానంలో వేలం

మద్దిపాడు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 19న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. దేవాలయంలో కొబ్బరికాయలు అమ్ముకోవటానికి రూ.25వేలు, టిఫిన్, టీ, కూల్‌డ్రిక్స్‌కు దుకాణాలకు రూ.25వేలు, పెండ్లి మండపం ఏర్పాటు, జనరేటర్‌పై లైటింగ్ ఏర్పాటుకు రూ.25వేలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు రూ.10వేలు, ఐస్‌క్రీం, సోడా బొమ్మల అంగడి కోసం రూ.10 వేలు దరావత్తుగా దేవదాయ శాఖ నిర్ణయించిందన్నారు. వేలంలో దుకాణాలు పాడుకున్నవారు ఏప్రిల్ 1 నుంచి సంవత్సరం పాటు వ్యాపారం చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఔత్సాహికులు పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యార్థుల విజ్ఞానయాత్ర

ఒంగోలు విద్య, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 140 మంది విద్యార్థుల విజ్ఞానయాత్ర విజయవంతంగా ముగిసింది. సమగ్ర శిక్ష ఏఎస్పీడీ ఆదేశాల మేరకు ఏఎంవో రమేష్, జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్, మరో 20 మంది ఉపాధ్యాయులు రెండు రోజుల పాటు ఈ యాత్రను చేపట్టారు. ఈనెల 14న మొదట విద్యార్థులు శ్రీహరికోటలోని షార్‌కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న అంతరిక్ష ప్రయోగాలను తెలుసుకున్నారు. స్పేస్‌టెక్నాలజీలో చేస్తున్న మార్పులు, రాకెట్ లాంచింగ్ ప్యాడ్‌లను సందర్శించారు. 15న బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ నక్షత్రశాలను సందర్శించారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రీయల్ టెక్నాలజీ సైన్స్ మ్యూజియంను సందర్శించి అక్కడ అనేక రకాలవినూత్న సైన్స్ మోడల్స్, వర్కింగ్ మోడల్స్, ప్రయోగాల గురించి ఉపాధ్యాయులు వివరించారు. విజ్ఞానయాత్ర ముగించుకొని ఒంగోలు వచ్చిన విద్యార్థులను డీఈవో కిరణ్‌కుమార్ ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా పోలేరమ్మ తల్లికి పూజలు

నాగులుప్పలపాడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట గ్రామంలో వేంచేసిన శ్రీపోలేరమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించారు. ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు అందజేశారు. అన్నసంతర్పణ చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఆలయం విద్యుద్దీపాలతో అలంకరించడంతో ప్రత్యేక శోభ సంతరించుకొంది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు, ఐఆర్ ప్రకటించాలి

ఒంగోలు విద్య, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉగాది కానుకగా పెండింగ్ డీఏలు, ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు కేవీజీ.కీర్తి, బి.వెంకట్రావు, బి.అశోక్‌కుమార్, వై.శ్రీనివాసులు, ఎం.రాఘవరావు, పీవీ.సుబ్బారావు ఒక ప్రకటనలో కోరారు. అన్ని రకాల ఆర్థిక బకాయిలను ఈనెలాఖరులోపు చెల్లించాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి గ్రామ పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూలును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత


విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న అంకారావు

సంతనూతలపాడు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని అంబేద్కర్ కమిటీహాల్‌లో ఆదివారం మాజీ సర్పంచ్ ఆర్.అంకారావు 110 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిను అందజేశారు. ఉత్తమ మార్కులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎం.రామాంజనేయులు, ప్రకాశం, అనిల్, వేణు, నారాయణ, సుధాకర్, తేజ పాల్గొన్నారు.

బార్బర్స్ సంఘం మండలాధ్యక్షుడిగా రమేష్

సంతనూతలపాడు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండల బార్బర్స్ సంఘం అధ్యక్షుడిగా జి.రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయిబ్రాహ్మణ సాధికారక కమిటీ కన్వీనర్ నరసింహారావు ఆధ్వర్యంలో సంతనూతలపాడులో శనివారం రాత్రి ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఇతర పదవులకు పలువురిని సంఘ సభ్యులు ఎన్నుకున్నారు.

రోబోటిక్స్‌పై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ సిద్ధార్థ

ఒంగోలు(రూరల్), మార్చి16(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవదిలోని స్వామిశివానంద పాఠశాలలో ఆదివారం రోబోటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ కొర్రపాటి సుధాకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రోబోటిక్స్ ట్రైనర్ సిద్ధార్థ మాట్లాడుతూ భవిష్యత్‌లో రోబోటిక్స్‌పైనే ప్రజలు ఆధారపడతారని చెప్పారు. వైద్యం, శాటిలైట్ రంగంలోను రొబోటిక్స్‌దే కీలక పాత్రగా ఉంటుందని, అందువల్ల విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని ఆ రంగంపై అడుగులు వేయలని కోరారు. కార్యక్రమంలో మాజీ సైనికుల రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెప్పల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ జి.గీతాలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జయవరంలో నవగ్రహ మండప నిర్మాణం

టంగుటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జయవరంలో నవగ్రహ మండప నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. నిర్మాణంలో ఉన్న నూతన శివాలయంలో నవగ్రహ మండపం నిర్మించ తలపెట్టారు. మల్లినేని రమేష్, లక్ష్మీరాజ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకను బ్రహ్మయ్య పంతులు నిర్వహించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు కల్చరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని మంగమ్మ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక మంగమూరు రోడ్డు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో చదివి వివిధ ప్రాంతాలలో ఉంటున్న వారు ఉత్సాహంగా హాజరయ్యారు. బాపట్ల ఆర్డీవో గ్లోరియా, నెల్లూరు సంగం సీఐ వేమారెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ ప్రకాశం చైర్మన్ బుజ్జి, ప్రముఖ లాయర్ బ్రహ్మారెడ్డి, నెప్పల వెంకటేశ్వర్లు, యామిని శ్రీను, మున్నంగి శ్రీధర్, కనకాద్రి లక్ష్మి, పద్మ, సుబ్బాయమ్మ, ఇందిర, నారాయణమ్మ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలను పాటించాలి

మద్దిపాడు, మార్చి 16(ఆంధ్రజ్యోతి):వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ బి.శివరామయ్య కోరారు. ఆదివారం మద్దిపాడు సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, ధృవపత్రాలను తమ వెంట ఉంచుకోవాలని ఆయన సూచించారు.

దిగులుబడి


దర్శిలో ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు


ఆరబోసిన ధాన్యం

వరిసాగు రైతులకు నష్టాలు
తెగుళ్లతో తగ్గిన దిగుబడులు - పెరిగిన పెట్టుబడులు
లభించని గిట్టుబాటు ధర
అయిన కాడికి ప్రైవేటు వ్యాపారులకు విక్రయం

దర్శి ప్రాంతంలో సాగర్ ఆయకట్టుకింద వరి సాగు చేసిన రైతులు నష్టాలపాలయ్యారు. ఓ పక్క తెగుళ్లు, మరోపక్క నీటి ఎద్దడితో దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఇంకోవైపు ఈ ఏడాది కూలిరేట్లు, పురుగుమందుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పెట్టుబడులు రెట్టింపయ్యాయి. అరకొరగా వచ్చిన ధాన్యాన్ని కొనే వారు లేక ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వెరసి రైతులు సగానికి సగం పెట్టుబడులు నష్టపోవాల్సి వచ్చింది.

దర్శి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సాగర్ ఆయకట్టు పరిధిలోని మాగాణి రైతులు వరిసాగు గిట్టుబాటు కాక నష్టాలు చవిచూస్తున్నారు. సాగునీటి ఇబ్బందులతో ఆయకట్టు చివరి భూములకు సక్రమంగా నీరందక ఇబ్బందిపడ్డారు. మరోపక్క తెగుళ్లతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పురుగు మందులు అధికంగా వాడాల్సిన పరిస్థితి రావటంతో పాటు కూలీ, ఎరువుల ధరలు పెరగటంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో అరకొరగా పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించక తక్కువ ధరలకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

దీంతో వరిసాగు చేసిన రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. దర్శి ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరిపైరుకు వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వలన తెగుళ్లు సోకి దిగుబడులు తగ్గిపోయాయి.

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందలేదు. సివిల్‌సప్లయిస్ శాఖ అధికారులు నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాలు కూడా సక్రమంగా కొనుగోలు చేయలేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం గ్రేడ్-1 రకానికి 75 కేజీల బస్తాకు రూ.1740, సాధారణ రకానికి రూ.1725 మద్దతు ధర ప్రకటించింది. కొనుగోలు కేంద్రాలు ధాన్యం కొనుగోలు చేసినట్లు అయితే అధికశాతం మంది రైతులకు గిట్టుబాటు ధర లభించేది. కొనుగోలు కేంద్రాలు అతితక్కువగా ఏర్పాటు చేయటంతో పాటు, నామమాత్రంగా పని చేయటంతో అధికశాతం మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయించారు. కొనుగోలు కేంద్రాలు నీరుగారిపోవటంతో ప్రైవేట్ వ్యాపారులు ఇదే అదునుగా భావించి 75 కేజీల బస్తాను కేవలం రూ.1400 కే కొనుగోలు చేశారు. దీంతో రైతులు గిట్టుబాటు ధర లభించక నష్టపోవాల్సి వచ్చింది. అదేవిధంగా ఎకరాకు ఈ ఏడాది రూ.40వేలకు పైగా పెట్టుబడి ఖర్చు అయింది. దిగుబడి సగటున 20 నుంచి 30 బస్తాలు మాత్రమే వచ్చింది. మార్కెట్‌లో లభించిన ధర ప్రకారం పండిచిన ధాన్యం విక్రయించగా పెట్టుబడులకు అంతంత మాత్రంగా వచ్చాయి. ఆరుగాలం కష్టించి శ్రమించిన శ్రమ వృథా అయ్యింది. పెట్టుబడుల అప్పులకు వడ్డీలు అదనంగా కట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు ఈ పరిస్థితి గుర్తించి గిట్టుబాటు ధర కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.


శింగరకొండ వైపు వెళ్లకుండా నామ్ రోడ్డు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు, బోర్డులు

తొలగించని దిమ్మెలు, బోర్డులు

- తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు
- శింగరకొండ వైపు వెళ్లని ఆర్టీసీ బస్సులు
- భక్తులకు ప్రైవేటు వాహనాలే దిక్కు

అద్దంకి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : తిరునాళ్ల సమయంలో ట్రాఫిక్ మళ్లింపు కోసం శింగరకొండ జంక్షన్ వద్ద అడ్డంగా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు, బోర్డులు రెండు రోజులు గడిచినా తొలగించ లేదు. దీంతో ఆర్టీసీ బస్సులు శింగరకొండ వైపు వెళ్లకుండా నామ్ రోడ్డులో నుంచి పోతున్నాయి. దీని వల్ల శింగరకొండ వెళ్లే భక్తులకు కష్టాలు తప్పడం లేదు. తిరునాళ్ల రోజు శింగరకొండ వైపు వెళ్లకుండా నామ్ రోడ్డులో శింగరకొండ సమీపంలో 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద అడ్డుగా సిమెంట్ దిమ్మెలు, బోర్డులను ఏర్పాటు చేశారు. తిరునాళ్ల గడిచి రెండు రోజులు అయినా దిమ్మెలు, బోర్డులు తొలగించకుండా అలానే వదిలి వేశారు. దీంతో కొద్దిమేర దారి మాత్రమే ఉండడంతో మోటార్‌బైక్‌లు, ఆటోలు, కార్లు మాత్రమే అద్దంకి వైపు నుంచి శింగరకొండ వైపు వెళ్తున్నాయి. గతంలో శింగరకొండ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు అటువైపు వెళ్లకుండా గోపాలపురం మీదుగా నామ్ రోడ్డులోకి వెళ్లిపోతున్నాయి. దీంతో శింగరకొండ వెళ్లే భక్తులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఏర్పడింది. పోలీస్ అధికారులు స్పందించి సిమెంట్ దిమ్మెలు, బోర్డులు తొలగింప చేయాలని భక్తులు కోరుతున్నారు.

కళాకారులను ఆదుకోవాలి

- తెలంగాణ ఎమ్మెల్సీ, ప్రజా గాయకుడు గోరటి వెంకన్న
- ఘనంగా ఒంగోలులో మాలల సాంస్కృతిక కళా జాతర
- హాజరైన ఎన్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్, పలువురు ప్రముఖులు
- ఆకట్టుకున్న కళాకారుల విన్యాసాలు

ఒంగోలు క్రైం, మార్చి16(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న మాల కళారూపాలకు పునరిజ్జీవం కల్పించి కళాకారులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఎమ్మెల్సీ, ప్రజా గాయకుడు గోరటి వెంకన్న కోరారు. ఆదివారం ఒంగోలు నగరంలో మాలల సాంస్కృతిక కళా జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హెచ్‌సీఎం కళాశాల నుంచి కళాజాతాలు ప్రదర్శనలు మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ వరకు కొనసాగింది.


కత్తిని పట్టుకుని ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తదితరులు

ఈక్రమంలో ప్రత్యేక వాహనంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయకుమార్, మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, తెలంగాణ సాంస్కృతిక కార్పొరేషన్ చైర్మన్ వెన్నెల గుమ్మడి, డాక్టర్ జీవీ.రత్నాకర్, దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, మాలమహాసభ కన్వీనర్ దండేల కృష్ణ, చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు ప్రజలకు అభివాదం చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. తొలుత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో విశిష్ట అతిథిగా విచ్చేసిన గోరటి వెంకన్న మాట్లాడుతూ కళాకారులకు ఎలాంటి ఆదరణ లేక అనేక కళలు అంతరిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రముఖులు మాట్లాడుతూ కళాకారులకు సంక్షేమ పథకాలు అమలు చేసి వారికి పెన్షన్లు మంజురు చేయాలని కోరారు. నివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా కళాకారులు మాలమాస్టిన్ యుద్ధ విన్యాసాలు, కర్రసాము, యక్షగానం తదితర ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కాగా సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కళాకారులను ఘనంగా సత్కరించారు.

గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ ఆశలన్నీ చైనా స్టోనాపైనే..

- జియామిన్‌లో అట్టహాసంగా ప్రారంభమైన ప్రదర్శన
- జిల్లా నుంచి తరలివెళ్లిన గ్రానైట్ వ్యాపారులు

చీమకుర్తి, మార్చి16(ఆంధ్రజ్యోతి) : కరోనా కాలం నుంచి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న గ్రానైట్ పరిశ్రమకు చైనా దేశంలో ఆదివారం నుంచి ప్రారంభమైన జియామిన్ స్టోన్‌ఫెయిర్ ఆశాదీపంగా మారింది. నాలుగురోజుల పాటు జరిగే జియామిన్ స్టోనాకు అంతర్జాతీయంగా జరిగే అతిపెద్ద ప్రదర్శనగా గుర్తింపు ఉంది. ప్రపంచవ్యాప్తంగా సహజసిద్ధంగా లభ్యమయ్యే స్టోన్స్, వాటి ఉత్పత్తులతో పాటు అధునాతన సాంకేతికనైపుణ్యాలతో రూపొందించిన మెషినరీలను సందర్శకుల కోసం స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శిస్తారు. ముఖ్యంగా చీమకుర్తిలో విస్తరించిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమకు ఈ స్టోన్ ఫెయిర్ అన్ని విధాల ఎంతో కీలకమైంది. గెలాక్సీ గ్రానైట్ క్వారీల నుంచి వెలికితీసే ముడిరాళ్ల 80శాతంకు పైగా చైనాకు ఎగుమతులు జరుగుతాయి. కరోనా తర్వాత జరిగిన పరిణామాలతో ఎగుమతులు గణనీయంగా తగ్గిపోయాయి. ఇటీవల బెంగళూరులో జరిగిన స్టోనాలో కూడా చైనా బయ్యర్లు హాజరుకాలేకపోవటంతో వ్యాపార లావాదేవీలు జరిగే అవకాశం లేక గ్రానైట్ వ్యాపారులు డీలాపడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో జియామిన్‌లో జరుగుతున్న స్టోనా గ్రానైట్ వ్యాపారుల్లో ఎన్నో అశలను రేకెత్తిస్తుంది. స్టోనాలో పాల్గొని నేరుగా చైనా బయ్యర్లను కలిసి వ్యాపార ఒప్పందాలను కుదుర్చుకునే అవకాశం వ్యాపారులకు లభించింది. అం దుకే ప్రముఖ క్వారీ అధినేతలు స్టోనాలో పాల్గొనటానికి చైనా వెళ్లారు. కృష్ణసాయి అధినేత శిద్దా హనుమంతరావు, సూర్యాగ్రానైట్స్ అధినేత బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఆర్‌ఆర్‌ఆర్ అధినేత రవిచంద్రన్, వీవా గ్రానైట్స్ యజమాని నవీన్‌రెడ్డిలతో పాటు పలువురు ఔత్సాహిక వ్యాపారులు స్టోనాలో పాల్గొనటానికి చైనా పయనమయ్యారు.


ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద సందర్శకులు

శిక్షణలో క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి

- అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య
- ఖోఖో స్త్రీ, పురుష రాష్ట్ర జట్ల ఎంపిక

పంగులూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనేందుకు ఎంపికైన రాష్ట్ర స్త్రీ, పురుష జట్లు శిక్షణ సమయంలో క్రీడా నైపుణ్యం పెంపొందించుకుని, జాతీయస్థాయి పోటీలలో రాణించాలని రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బీసీహెచ్ గరటయ్య అన్నారు. పంగులూరు ఎంఎస్ఆర్‌అండ్ బీఎస్‌ఎం జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో రాష్ట్ర స్త్రీ, పురుష ఖోఖో జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. ఈ ఎంపికలో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి పురుష క్రీడాకారులు 95 మంది, స్త్రీ క్రీడాకారులు 75 మంది పాల్గొన్నారు. వీరిలో 15 మంది పురుష క్రీడాకారులను, 15 మంది స్త్రీ క్రీడాకారులతో పాటు ముగ్గురు స్టాండ్ బైగా చేశారు. ఎంపికలో పలు జిల్లాల ఖోఖో అసోసియేషన్ కార్యదర్శులు, జిల్లా మేనేజర్లు, కోచ్‌లు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడా జట్లకు 17 నుంచి ఈనెల 28వ తేదీ వరకు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఇరు జట్లు ఒడిశా రాష్ట్రంలోని పూరి పట్టణంలో ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే 57వ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని సీతారామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రిఫరీస్‌బోర్డ్ కన్వీనర్ ఎంవీఎస్ఎస్ ప్రసాద్, శరత్, వాసు, ప్రసాద్‌రెడ్డి, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, కాశీవిశ్వనాథరెడ్డి, కోశాధికారి కె.హనుమంతరావు, శీనయ్య, రఘుబాబు, రమాదేవి, ఖలీల్‌అహమ్మద్, లత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస రెడ్డి, రాయిణి వెంకట సుబ్బారావు, గుడిపూడి రామారావు, కోచ్‌లు పాల్, డీఎల్ రెడ్డి పాల్గొన్నారు.


జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన రాష్ట్ర పురుషుల జట్టు


ఎంపికైన రాష్ట్ర స్త్రీల జట్టు

ఎంపికైన పురుషుల జట్టు

ఖోఖో రాష్ట్ర పురుషుల జట్టుకు పి.శివయ్య, వి.భానుప్రసాద్ (విజయనగరం), కె.రామ్మోహన్, ఫణికుమార్, కె.వంశీ, కె.మహేష్, ఎ.వీరాంజనేయులు, ఎం.ప్రసాద్ (ప్రకాశం), బి.కిరణ్ (విశాఖ), కె.కొండలరావు (కృష్ణ), కె.ప్రశీణ్ (శ్రీకాకుళం), జి.సంతోష్ (అనంతపురం), ఎం.శాయివెంకట్ (తూ.గో), హెచ్.రాజేష్‌కుమార్ (చిత్తూరు), స్టాండ్ బైగా జి.నాగవెంకటశివ (ప్రకాశం), జి.హరిప్రసాద్(కడప), ఎస్ఎస్ఎస్.లోహిత్ (శ్రీకాకుళం), కె.శివశంకర్ (తూ.గో)లు ఎంపికయ్యారు.

స్త్రీల జట్టుకు ఎంపికైనవారు

జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర స్త్రీల జట్టుకు పీసీహెచ్.అనూష డి.నందిని (తూ.గో), కె.కుమారి, ఎం.మౌనిక, ఐ.వైష్ణవి(కృష్ణ), ఈ.హైమావతి, ఎం.దివ్యశ్రీ, ఎస్.పావని డి.శివనాగలక్ష్మి(ప్రకాశం), కె.రమ్య, బి.భార్గవి (నెల్లూరు), టి.అనిత (ప.గో), పి.హేమ (విశాఖ), ఎం.మునిలక్ష్మి (చిత్తూరు), ఏజే శ్రావణి(విజయనగరం), స్టాండ్ బైగా జి.పావని (తూ.గో), ఆర్.సరస్వతి(శ్రీకాకుళం), కె.సౌభాగ్య (కర్నూలు) ఎంపికైనట్లు రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి తెలిపారు.

ఆరోపణలకు కాలమే సమాధానం చెబుతుంది..

- కర్లపాలెం పునరావాస కాలనీ పూర్తి కాకుండా పోర్టు పనులు ముందుకెళ్లే పరిస్థితి లేదు
- కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు నిర్మించకుండా, వారికి పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయా లు కల్పించకుండా పోర్టు పనులు ముందుకెళ్లే పరిస్థితి ఉండబోదని నెల్లూరు జిల్లా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పోర్టు నిర్మాణ పనులకు తాను అడ్డంకి అయినట్లు వస్తున్న విమర్శలకు సరైన సమయంలో సమాధానం చెబుతానని, ఇదంతా రాజకీయంగా నా పరాభవాన్ని కోరుకున్న వారు చేస్తున్న పని అని ఆయన ఆరోపించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను పట్టించుకోకుండా, వారికి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు నిర్మించకుండా, తగిన పరిహారం ఇవ్వకుండా పోర్టు నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. నేటికీ ఆయా కాలనీల ప్రజలు మౌలిక సదుపాయాల కోసం, శ్మశానాలకోసం, గుడి నిర్మాణం కోసం తనకు విజ్ఞాపనలు అందజేస్తుండగా, వారి సమస్యల పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడి కృషి చేస్తున్నామని వివరించారు. పోర్టు పనులు అడుగు ముందుకు పడాలంటే కర్లపాలెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీపనులు ముందుకు సాగాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. పోర్టు నిర్మాణపనులకు మీరే అడ్డంకిగా ఉన్నారని విమర్శలు వస్తున్నాయి కదా... అని ఓ విలేకరి ప్రశ్నించగా వాటికి తానిప్పుడు సమాధానం చెప్పబోనని, సరైన సమయంలో వాస్తవాలు వెల్లడిస్తానని పేర్కొన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు కందుకూరుకి వచ్చిన సందర్భంగా మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 50కోట్లు మంజూరుచేస్తానని ఇచ్చిన హామీమేరకు, రూ. 5 కోట్లు విడుదల చేశారని, కందుకూరు రూరల్ మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ. 22 కోట్లతో మంజూరు ఉత్తర్వులు ఇచ్చారని, కొండముడుసుపాలెం రోడ్డు వద్ద కందుకూరు బైపాస్‌కు అండర్‌పాస్ నిర్మాణానికి కూడా ఉత్తర్వులు వచ్చాయని వివరించారు. ఈ విషయంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి ఎంతో ఉందని నాగేశ్వరరావు పేర్కొన్నార. అలాగే సీటీఆర్ఐ వద్ద నుంచి వాసవీకాలనీ వరకు రోడ్డు విస్తరణకు కూడా అనుమతులు వచ్చాయన్నారు. గత 8 నెలల కాలంలో కందుకూరు మున్సిపాలిటీలో రూ.8 కోట్లతోనూ, 27 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు, లింకురోడ్ల నిర్మాణం చేశామని తెలిపారు. 120మందికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థికసహాయం తెప్పించగలిగామని వివరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు, బెజవాడ ప్రసాదు, పిడికిటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

పకడ్బందీగా 'పది' పరీక్షలు

● కేంద్రాలలో ఆర్‌జేడీ లింగేశ్వర్‌రెడ్డి



బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఆయన ఆదివారం మధ్యాహ్నం పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌జేడీ రామ లింగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా పరీక్షల ఏర్పాట్లు చేశామన్నారు. మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం లాంటివి కల్పించినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి పరీక్షలు ప్రారంభం అవుతాయన్నారు. మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. గిద్దలూరులో మొత్తం 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 1,164 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు తెలిపారు.

పరీక్ష కేంద్రంలో ఆర్‌జేడీ తనిఖీ

కంభం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాలను ఆదివారం గుంటూరు రీజనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, వాసవి విద్యానికేతన్ కేంద్రాలలోని సౌకర్యాలు, వసతులను పరిశీలించారు. గాలి, వెలుతురు, నీరు వంటి వాటిపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈవో మాల్యాద్రి, అధికారులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

పెద్దదోర్నాల : పదవ తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంఈవో మస్తాన్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 590 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అందుకు గాను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 290 మంది విద్యార్థులు రవీంద్ర ఉన్నత పాఠశాలలో, 150 మంది, వసంత జూనియర్ కళాశాలలో 150 మంది విద్యార్థులు చొప్పున 3 పరీక్షా కేంద్రాలు కేటాయించినట్లు చెప్పారు. పరీక్షలు ఉదయం గం.9.30 నుండి మధ్యాహ్నం గం.12.45ల వరకు జరుగుతాయన్నారు. ఈ క్రమంలో 144 సెక్షన్ అమలుచేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, ఫ్యాన్లు, వైద్యసిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

అన్న క్యాంటీన్‌కు రూ.25వేల విరాళం



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి చెక్కును అందిస్తున్న అబ్దుల్ జిలాని

గిద్దలూరుటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటిన్‌కు రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి రూ.25వేల విరాళాన్ని ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి అందించారు. స్థానిక టీడీపీ కార్యాలయం నందు కంభంకు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి అబ్దుల్‌జిలాని రూ.25వేల చెక్కును ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి అందించారు. పేదలకు అన్నంపెట్టే అన్న క్యాంటీన్లకు చేయూతనివ్వాలనే మంచి ఆలోచనతో విరాళాలు ఇచ్చిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి అబ్దుల్‌జిలానిని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో హబీబుల్లా, మౌలాలి, న్యామతుల్లా పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

గిద్దలూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.బయనపల్లె గ్రామంలోని దూదేకుల వీధిలో నీటిసమస్య పరిష్కారమైంది. ఈప్రాంత వాసులు నీటి కోసం ఇబ్బందులు పడుతుండగా స్పందించిన సర్పంచ్ బండి శ్రీనివాసులు నూతనంగా బోరు ఏర్పాటు చేసి తాజాగా మోటారు బిగించి నీటిని పంపింగ్ చేయించడంతో ఆప్రాంతంలో నీటిసమస్య పరిష్కారమైంది.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కనకదుర్గ

పెద్దారవీడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచి మేనేజర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ అన్నారు. పెద్దారవీడు చెంచు గూడెంలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కనకదుర్గ మాట్లాడుతూ గిరిజనగూడేలలో వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యసూత్రాలపై రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు నిత్యం ఉపయో గించే హైజనిక్స్ కిట్లను పంపిణీ చేశారు. సత్యసాయి సేవాసంఘం ప్రతినిధులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు విజయ్‌కుమార్, కిరణ్, సత్యసాయి సేవాసంఘం జిల్లా అధ్యక్షులు తంగిరాల రామిరెడ్డి, సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నగుడిపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం

పెద్దదోర్నాల, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగుడిపాడు గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీ సీతారామలక్ష్మణ సంజీవసేవాసమితి ఆధ్వర్యంలో నంద్యాలకు చెందిన శాంతిరాం వైద్యశాల సహకారంతో నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్య నిపుణులు ఆది, సుజాత, వెంకటలక్ష్మీ 68 మంది కంటి రోగులను, 45 మందికి ఈసీజీ మొత్తం 115 మంది రోగులను పరీక్షించారు. 11 మందిని శస్త్రచికిత్సకు సఫార్సు చేశారు. వీరిని శాంతిరాం వైద్యశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సులో తీసుకువెళ్లి చికిత్సల అనంతరం తిరిగి గ్రామానికి తరలిస్తారని నిర్వాహకులు ఆర్‌ఎంపీ వైద్యులు బాలరాజు చౌదరి తెలిపారు.

మహిళపై కేసు నమోదు

కంభం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కంభం మండలంలో ఆదివారం సాయంత్రం ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో పాత్రికేయుల ఫొటోలుపెట్టి దూషిస్తున్న మహిళపై బాధితులు ఫిర్యాదు చేయగా వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సమాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా, వ్యక్తిగతంగా దూషించడం నేరమన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొమరోలు, మార్చి16 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం మోటర్ సైకిల్‌ను ఢీ కొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ముత్తరాసుపల్లి గ్రామంలోని కడప-అమరావతి రాష్ట్రీయ రహదారిలో ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు కొమరోలు మండలం తాటిచర్ల గ్రామానికి చెందిన గంగిపోగు ఫ్రాన్సిస్ రోజువారిగా బేల్దారి పని ముగించుకొని ఇంటికి వెళుతున్నాడు. ఇంతలో గుర్తు తెలియని వాహనం మండలంలోని ముత్తరాసుపల్లి సమీపంలోని ప్రధాన రహదారిలో మోటర్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో ఫ్రాన్సిస్(30) రోడ్డుపై పడి అక్కడిక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని శోకసముద్రంలో మునిగిపోయారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కంభం రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత

● అలంకారప్రాయంగా నీటికొళాయిలు ● వెయిటింగ్ రూంకు తాళాలు ● లిఫ్టు నిర్మించారు.. ప్రారంభం మరిచారు



కంభం రైల్వే స్టేషన్

కంభం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కంభం రైల్వే స్టేషన్‌లో సమస్యలు కూతపెడుతున్నాయి. సాధారణ రోజుల్లోనే నీటికొరత వేధిస్తోంది. ఇక ఈ వేసవి మాసంలో తాగునీటి సమస్యలు అన్నీ ఇన్నీ కావు. కంభం రైల్వేస్టేషన్‌లో తాగునీటి సమస్య ప్రయాణికులను తీవ్రంగా వేధిస్తోంది. ప్రస్తుతం రైల్వేస్టేషన్ పరిస్థితి ఆదాయం బారెడు, సౌకర్యాలు బెత్తడు అనే విధంగా తయార్యాయి. ఇక్కడి నుండి రోజుకు సుమారు లక్ష, ఏడాదికి రూ.3.80 కోట్ల ఆదాయం వస్తున్నా ఆ స్థాయిలో వసతులు కల్పించడం లేదనే విమర్శలున్నాయి. మంచినీటి కూలింగ్ కుళాయిలు అలంకారప్రాయంగా మారాయి. అట్టహాసంగా ప్రారంభించిన నీటిశుద్ధి యంత్రాలు, కూలింగ్ మిషన్లు మూతపడ్డాయి. ఇక్కడికి కంభం, కనిగిరి, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల నుంచి నిత్యం 2 వేలకు పైగా ప్రయాణికులు వస్తుంటారు. వారికి సరైన సౌకర్యాలు లేవు. వేచి ఉండే గదులకు ఎప్పుడూ తాళాలు వేసి ఉంటాయి. దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఫ్లాట్‌ఫాంపైనే పడిగాపులు కాయాల్సిందే. 1, 2 ఫ్లాట్‌ఫారాలపై జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపించిందని, ఓవర్ బ్రిడ్జి ఎక్కేందుకు ఇబ్బందులు పడే వికలాంగులు, వృద్ధుల కోసం నిర్మించిన లిఫ్టు ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైనా ప్రయాణికుల అవసరాలకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





అలంకారప్రాయంగా కూలింగ్ మిషన్, నిరుపయోగంగా ఉన్న కొళాయిలు

పరీక్షలంటే భయం వీడాలి



పదో తరగతి విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి ఆత్మ విశ్వాసం కలిగి ఉండాలని కమలా విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ పెనుగొండ పవన్‌కుమార్ అన్నారు. స్థానిక కమలా హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆత్మవిశ్వాసం పెంచుకోవాలన్నారు. పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధిస్తే ఉన్నత చదువులకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, పుల్లయ్య, మురళీకృష్ణ, స్వరూప్ రంజన్, సుధాకర్ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు



ప్రజలతో మాట్లాడుతున్న డీపీవో వెంకట్‌నాయుడు

తర్లుపాడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగసముద్రం, కలుజువ్వలపాడు, జగన్నాథపురం, తుమ్మలచెరువులో ఇంటిపన్ను వసూళ్లను జిల్లా పంచాయతీ అధికారి వెంకట్‌నాయుడు నిర్వహించారు. ఆదివారం ప్రత్యేకంగా ప్రభుత్వం నిర్వహించిన ఇంటి పన్ను వసూళ్లను ఏ విధంగా చేస్తున్నది, అసలు విధులు చేస్తున్నారా..? లేదా..? అనేది తనిఖీలు నిర్వహించారు. ఈ నెలాఖరులోపు ఖచ్చితంగా నూరుశాతం పన్నులు వసూలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం చెత్తసంపద కేంద్రాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా వేయాలని, చెత్త నుంచి సంపద ద్వారా పంచాయతీకి ఆదాయం చేకూరుతుందన్నారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా గుర్తించుకోవాలన్నారు. గ్రామంలో ప్రతి రోజు కార్మికులు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. ప్రతి డంపింగ్ యార్డులో వానపాములను వదిలి సేంద్రీయ ఎరువులు తయారు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈయన వెంట డీఎల్‌పీవో వై.భాగ్యవతి, ఇన్‌ఛార్జ్ ఈవోపీఆర్‌డీ సుధాకర్‌బాబు ఉన్నారు.

పొదిలి : గ్రామ పంచాయతీల్లో పన్ను వసూలును వేగవంతం చేయాలని డీపీవో జి.వెంకటనాయుడు అన్నారు. మండలంలోని ఉప్పలపాడు పంచాయతీ కార్యాలయాన్ని ఆదివారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటిపన్నులు సకాలంలో వసూలు చేయాలని సూచించారు. ఇంటి పన్నుల గురించి గ్రామస్థులకు తెలియజేసి, వసూలు చేయాలన్నారు. అంతేకాకుండా గ్రామంలో పారిశుధ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. గ్రామంలో జరుగుతున్న పన్నుల వసూలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం





గిద్దలూరు, తర్లుపాడులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

గిద్దలూరుటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం నిరసన చేపట్టి ప్రాణాలను త్యజించిన అమరజీవి అని కొనియాడారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధన కోసం, ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అమ్మవారిశాల అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, ప్రధానకార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, టీడీపీ నాయకులు శివపురం మురళి, రాంభూపాల్, మహిళ నాయకురాలు బొంతా లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: స్థానిక నటరాజ్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల లోని రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో పబ్బతి సుబ్బారావు, సత్యసాయిసేవాసమితి అధ్యక్షులు రామిరెడ్డి, బొగ్గరపు రమేష్, మొగిలి గుప్త, మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

గిద్దలూరు : అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని వివిధ సంఘాల ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు సూరె నాగేశ్వరరావు, అమ్మవారిశాల అధ్యక్షులు వాడకట్టు రంగ సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు శివపురం ఆంజనేయులు, గౌరవాధ్యక్షులు గర్రె సత్యనారాయణ, ఆవోపా అధ్యక్షులు దారా రాములు, వాసవిక్లబ్, ఇతర ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రంథా లయంలో గ్రంథపాలకురాలు ప్రసన్న కుమారి, రిటైర్డ్ డిప్యూటీ డీఈవో ముప్పూరి కాశీశ్వరరావు, ముండ్లపాడు హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీదేవి, కందగట్ల పిచ్చయ్య, అంజనేయులు, మల్లారెడ్డిలు నివాళి అర్పించారు. రాచర్ల మండలం ఆకవీడులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మాగులూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం రమణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తర్లుపాడు : తర్లుపాడులోని పొట్టి శ్రీరాములు పార్కులో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన విగ్రహానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో స్నేహా యూత్ అధ్యక్షులు బి.పుల్లయ్య, సెక్రటరీ కశ్శెట్టి రవికుమార్, ఎస్.సుబ్రహ్మణ్యం, పోలేపల్లె జనార్ధన్‌రావు, దోగిపర్తి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : పొట్టి శ్రీరాములు జయంతిని స్థానిక నెహ్రూబజార్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ నాయకులు పూర్ణ చంద్రరావు, కిశోర్‌కుమార్, ప్రసాదరావు, కిరణ్, పి.లక్ష్మీనారాయణ, ఎస్.కేశవరావు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : ఎర్రగొండపాలెంలోని ఆర్యవైశ్య, యువజన సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఘన నివాళ్లు అర్పించారు. ఆ సంఘం నాయకులు ఎస్వీ ప్రసాద్, రెడ్డి నరసింహారావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పొట్టి రవికుమార్, రామంజనేయులు, కే.సురేష్, సుబ్బారావు, నారాయణ తదితరులు పాల్గొని నివాళి అర్పించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాముల 125 జయంతి కార్యక్రమం నిర్వహించారు.

కడప జిల్లా ఎడ్ల హవా



బండలాగుతున్న ఎడ్లజత

గిద్దలూరుటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవ గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి బండలాగుడు పోటీల్లో కడప జిల్లా ఎద్దులు హవా చాటాయి. కడప జిల్లా పొద్దుటూరు మండలంలోని చౌటుపల్లి గ్రామానికి చెందిన మార్తాల చంద్రఓబుల్‌రెడ్డి ఎద్దులు 3644 అడుగుల దూరం బండను లాగి మొదటి బహుమతి రూ.1,11,111 రూపాయలు గెలుచుకున్నాయి. రెండవ బహుమతిని కూడా ఇదే రైతుకు చెందిన ఎద్దులు 3429 అడుగుల దూరం బండను లాగి రూ.77,777 గెలుచుకున్నాయి. మూడవ బహుమతిని కుందురు రాం భూపాల్‌రెడ్డికి చెందిన ఎద్దులు గెలుచుకున్నాయి.

నాల్గవ బహు మతిని బాపట్ల జిల్లా బల్లికురవ మండలం పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్లజత, ఐదవ బహుమతిని నంద్యాల జిల్లా జిల్లెలకు చెందిన గొటికె దినేష్‌రెడ్డి ఎడ్లజత, ఆరవ బహుమతిని కర్నూలు జిల్లా గడివేములకు చెందిన కలాంబాష ఎడ్లు గెలుచుకున్నాయి. విజేతలైన ఎడ్ల యజమానులకు మూడు, నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు రూ.55,555 రూ.33,333 రూ.22,222 రూ.11,111లు అందజేశారు. మొత్తం 11 జతల ఎడ్లు ఈపోటీల్లో పాల్గొన్నాయి. మిగతా వాటికి కన్సోలేషన్ బహుమతుల కింద రూ.10వేల చొప్పున ప్రోత్సాహక నగదు అందజేశారు.

ఎడ్ల పోటీలలో అపశ్రుతి

బండలాగుతూ ఎద్దు మృతి



అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

గిద్దలూరు టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవ గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలలో ఆదివారం అపశ్రుతి చోటుచేసుకొంది. మార్కాపురం మండలం బొడిచెర్ల గ్రామానికి చెందిన నక్షత్రరెడ్డి ఎడ్లజత బండలాగుతుండగా ఒక ఎద్దు కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ఎద్దు మృతితో ఆప్రాంతంలో ఒక్కసారిగా విషాదం అలముకుంది. రైతు నక్షత్రరెడ్డితోపాటు పశుపోషకులు సైతం కన్నీరు పెట్టుకున్నారు. అక్కడికి సమీపంలోనే ఆ ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహించారు. నరవ గ్రామస్థులు అప్పటికప్పుడు రూ.3.22 లక్షలను విరాళాలుగా సేకరించి రైతు నక్షత్రరెడ్డికి అందజేశారు.

పూరిగుడిసె దహనం

గిద్దలూరుటౌన్ : మండలంలోని ఓబులాపురం గ్రామంలో డి.ఓబులమ్మకు చెందిన పూరిగుడిసె దహనమైంది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో ఈప్రమాదం జరిగిందని ఓబులమ్మ వాపోయారు. ఒక్కసారిగా పూరిగుడిసె దగ్ధంకావడంతో ఇంట్లో ఉన్న సామాన్ల తోపాటు కూతురు పెళ్లికి దాచి ఉంచిన నగదు అగ్నికి ఆహుతైంది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మార్కాపురంలో శక్తి టీం ప్రారంభం



శక్తి టీంను ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురంరూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ యూ. నాగరాజు సిబ్బందితో కలిసి శక్తి టీంను ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో మహిళల రక్షణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మహిళలు ఎక్కడైన ఆపదలో ఉంటే వెంటనే తక్షణ సహాయం కోసం 112, 181, 1930, 1908 నెంబర్‌లకు కాల్‌చేసి సాయం పొందవచ్చన్నారు. ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఏర్పాటుచేసిన ఈ శక్తి టీంను ఆపదలో ఉన్న మహిళలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టుటౌన్ ఎస్ఐ రాజమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత కోసమే జాబ్‌మేళాలు

● మార్కాపురం డీఎస్పీ నాగరాజు



జాబ్‌మేళాలో పాల్గొన్న యువకులు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతి, యువకుల కోసమే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు మార్కపురం డీఎస్పీ నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక డా.బీఆర్.అంబేద్కర్ ఆడిటోరియంలో ఎస్పీ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో జాబ్‌మేళా నిర్వహిం చామని అన్నారు. ఈ జాబ్‌మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగ యువతి, యువకులను ఇంటర్వ్యూ నిర్వహించారు. ముందుగా యువతి యువకులకు పలు కంపెనీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రభాకరరావు, సబ్‌ఇన్‌స్పెక్టర్ పి.చౌడయ్య, కంపెనీల ప్రతినిధులతో పాటు సచివాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 58 మంది ఉద్యోగాలకు ఎంపిక

గిద్దలూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడ్‌ఆప్ సంస్థలు సాయిచైతన్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 58 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. 80 మంది నిరుద్యోగులు పాల్గొనగా హెటిరోడ్రగ్స్, అపోలో ఫార్మసి, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ కంపెనీలకు 58 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జి.రంగస్వామి, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ నాదర్‌బాబు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

గిద్దలూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాశాల వీధిలోని శ్రీసత్యసాయి బస్‌షెల్టర్ ఆవరణలో సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవికాలం పూర్తయ్యేంత వరకు కూలింగ్ మినరల్ వాటర్‌ను అందిస్తామని సత్యసాయిసేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలుకుల గ్రామంలో గంగాపార్వతి సమేత మల్లేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అఖిల భారత విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యవర్గ సభ్యులు యక్కలి రాఘవులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల కార్యక్రమాలలో 108 కుండి జ్ఞాన గాయత్రి మహాయజ్ఞ హోమం నిర్వహించారు. ఈ మహాయజ్ఞ హోమంపూజ కార్యక్రమంలో 432 మంది దంపతులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో ఎర్రగొండ పాలెం వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని పూజలు నిర్వహించారు. వేదపండితులు, కమిటి సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఉగాది ముందు వచ్చే ఐదు వారాల జాతరలో భాగంగా మూడో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. నాగదేవతలకు పూజలు నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, పోలేరమ్మ ఉత్సవ కమిటీ నాయకులు దొడ్డా రవికుమార్, రామాంజనేయులు, మట్టం శ్రీనివాసులు, వన్నెబోయిన బ్రహ్మం, గుమ్మా అంకయ్య, శ్రీనివాసులరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి తిరునాళ్లు

త్రిపురాంతకం : మండలంలోని గుట్లఉమ్మడివరంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రనరసింహస్వామి తిరునాళ్లు ఈనెల 17, 18, 19 తేదీలలో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి తెలిపింది. ఈ సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ముఖాముఖి

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

టి.కిశోర్‌బాబు, ఎస్ఐ, పామూరు



ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన సదస్సులు నిర్వహించాం. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తున్నాం

ప్ర: మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకొంటున్నారా?

జ: ప్రతిరోజు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. మద్యం సేవించి వాహనాలు నడిపేవారికి అపరాధ రుసుం విధిస్తున్నాం. ఈసందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్ర: ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకొంటున్నారా?

జ: పామూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకొంటున్నాం. ప్రధాన కూడళ్లలో పోలీస్ సిబ్బందిని ఏర్పాటుచేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూస్తున్నాం. ఆటోలు, సరుకులు దిగుమతి చేసే వాహనాలు రహదారులపై నిలపకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: చోరీలు జరగకుండా రాత్రుళ్లు గస్తీ నిర్వహిస్తున్నారా?

జ: చోరీలు జరగకుండా రాత్రిల్లు గస్తీని ముమ్మరం చేశాం. పామూరులో పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నాం.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన తూర్పుగంగవరం పంచాయతీ సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగమ్మ తల్లిని ఆదివారం అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మతల్లి భక్తుల కోర్కెలను తీర్చే తల్లిగా పూజిస్తూ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులు గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటూ పొంగళ్లు పెట్టి ఆలయ ప్రదక్షిణ చేసి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ అర్చక పూజారి ఎన్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌పి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పూరిమెట్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సిబ్బంది ఇంటింటికి వెళ్ళి జ్వరాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి వెంకటరావు, సీహెచ్‌వో లక్ష్మి, ఏఎన్ఎం మీరాబీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి

పామూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆపార్టీ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దద్దాల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. పామూరు మండల వైసీపీ అధ్యక్షుడుగా గంగసాని హుసేన్‌రెడ్డి వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

దర్శి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం నాయకుడు సందు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని లక్ష్మీనారాయణపురంలో రైతులు పండించిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు తక్కువ ధరలకు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించుకోవల్సిన దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

వెలిగండ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రాలను అందరి సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు మండలంలోని టీడీపీ నాయకులు, ప్రజలు నాగిరెడ్డిపల్లి ప్రభుత్వ అసుపత్రికి రూ.ఆరు లక్షల విలువ గల బెడ్లు, కుర్చీలు, టేబుల్స్ ఫ్రిడ్జ్, ఆపరేషన్ థియేటర్, మెడికల్ పరికరాలు అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నాగిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి పరికరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి దాతలు సహకారం అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలను మెరుగుపర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని చెప్పారు. అందరి సహకారంతో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పది సంవత్సరాల తర్వాత సిజేరియన్ ప్రసవ సేవలు ప్రారంభమయ్యాయని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ తమీమ్ అన్సారియా సలహాతో కనిగిరి వైద్యశాలలో కంగారు మదర్ కేర్ విధానాన్ని తీసుకొచ్చినట్టు చెప్పారు. ఆసుపత్రిలో ఓపీల సంఖ్య పెరిగిందన్నారు. దాతల సహకారం వల్లే ఆస్పత్రిలో సేవలు పునరుద్ధరించినట్టు చెప్పారు. అదే స్ఫూర్తితో నాగిరెడ్డిపల్లి ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పిస్తే చుట్టుపక్కల ఉండే గ్రామ ప్రజలకు వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఇందుకు దాతల సహకారం కోరడంతో వెంటనే మూడు నెలల్లో ఆసుపత్రి అభివృద్ధికి సహరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి నియోజకవర్గ టీడీపీ నాయకులు శ్యామల కాశిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, ఒంగోలు శ్రీను, చిలకల వెంకటేశ్వర్లు, మీనిగ కాశయ్య, సానజయపాల్ రెడ్డి, సాన నారయణరెడ్డి, రాజగోపాల్, కేసరి రమణారెడ్డి, చౌడారెడ్డి, కారంపూడి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారయణ, కార్యకర్తలు పాల్గొన్నారు



వెలిగండ్ల: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పరిహారం అందేలా కృషిచేస్తా!

కనిగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి పరిహారం అందించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని పేరంగుడిపల్లి కొత్తపల్లి వద్ద నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ భూ బాధితులను ఆదివారం ఎమ్మెల్యే స్వయంగా కలసి మాట్లాడారు. పేరంగుడిపల్లి కొత్తపల్లి వద్ద రైల్వే ట్రాక్ ఏర్పాటుతో ఏడు గృహాలను పేదలు కోల్పోతున్నారు. గతంలో రెవెన్యూ అధికారుల తప్పిదాలతో అక్కడ గృహాలే లేవని నమోదు చేశారు. ఇది సమస్యగా మారి రైల్వేలైన్ ఏర్పాటును బాధితులు అడ్డుకోవడంతో పనులు ఆగిపోయాయి. ఈవిషయాన్ని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పరిహారం అందించాలని కోరారు. ఈక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర బాధితులను కలసి సర్దిచెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటే స్థానికంగా ఉన్నవారే నష్టపోతారన్నారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. దీంతో బాధితులు సానుకూలంగా రైల్వేలైన్ ఏర్పాటకు సహకరిస్తామని ఎమ్మెల్యే ఎదుట రైల్వే అధికారులు, కాంట్రాక్టర్‌కు చెప్పటంతో సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో తహసీల్దార్ రవిశంకర్, రైల్వే ఇంజనీర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేం!

» పొట్టి శ్రీరాములుకు నివాళి

కనిగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి త్యాగాలను నేటి తరాలకు తెలియజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి ప్రాంగణంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు మన ప్రాంతంలోని పీసీపల్లి మండలం పడమటపల్లి గ్రామంలో జన్మించారన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం, తెలుగు బాష మాట్లాడే వారు ఒకే రాష్ట్రంగా ఉండాలని భావించిన పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగానికి సిద్ధమయ్యారన్నారు. అప్పటి ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న తమిళనాడులో తెలుగువారి పట్ల చిన్నచూపు చూస్తున్న వైఖరిని వ్యతిరేకించి ఆమరణ దీక్షకు పూనుకుని దీక్షలోనే మరణించారన్నారు. నేటితరం అమరజీవి త్యాగాన్ని ఎప్పుడూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), తమ్మినేని వెంకటరెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), నంబుల వెంకటేశ్వర్లు, ఓలేటి చిన్నా, ఫిరోజ్, ఐవీ నారాయణ, మారుతి, బుల్లా బాలబాబు, రోషన్ సంధాని, గుడిపాటి ఖాదర్, తిరుపాలు, చీకటి వెంకటసుబ్బయ్య, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, బడే సాహెబ్, కేవీఎస్ గౌడ్, రిజ్వాన్, కరణం అరుణ, షేక్ వాజిదా బేగం, తులసి, దొరసాని, పార్వతి, నారాయణమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

పామూరులో.. పామూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు త్యాగంతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజా రహంతుల్లా అన్నారు. స్థానిక వాసవీమాత దేవస్థానం వద్ద అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య, టీడీపీ నాయకలు పందిటి హరీష్, పాలపర్తి రమణయ్య, మెంటా నరసింహారావు, బండ్ల నారాయణ, జనసేన మండల అధ్యక్షుడు దరిశి ఏడుకొండలు, వాసవీ దేవస్థాన అధ్యక్షుడు కోట నరసింహారావు, మండ్ల రమణయ్య, సోమిశెట్టి శ్రీనివాసులు, కొత్తూరి హరగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో.. దర్శి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం దర్శిలో ఘనంగా నిర్వహించారు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐ రామారావు, దర్శి మురళీ, మానవతా స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి తదితరులు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎంసీహెచ్ సుబ్బారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, వాసవీ వనితా క్లబ్ ఆవరణలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు సంధ్యారాణి, కార్యదర్శి సుశీల తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో టి.సత్యలక్ష్మి, మునగా లక్ష్మి, మహేశ్వరి, సౌజన్య, శ్రీలక్ష్మి, సావిత్రి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో..

దొనకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీపట్టాభి రామస్వామి దేవస్థానంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కాళ్ల హనుమంతు, పట్టణ అధ్యక్షుడు పరుచూరి రమేష్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలంలోని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాములు గుడి నిర్మాణానికి భూమిపూజ

పీసీపల్లి, మార్చి16 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు స్వగ్రామమైన పడమటిపల్లిలో పూర్వీకులు నివాసం ఉన్న ఇంటి స్థలంలో గుడి నిర్మించేందుకు అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భూమి పూజ చేశారు. ఆదివారం అమరజీవి జయంతిని గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పేరకం నాగాంజనేయులు, ఏల్చూరి బ్రహ్మయ్య, కాకొల్లు కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అలక్ష్యం వహిస్తే సహించం

» ఎంపీపీ గంగసాని లక్ష్మి

పామూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులపై అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీపీ గంగసాని లక్ష్మి హెచ్చరించారు. ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మండల పరిషత్‌కు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు పంచాయతీ కార్యదర్శులు తీర్మానాలు ఇవ్వడం లేదన్నారు. వచ్చే సమావేశంలోగా తీర్మానాలు ఇవ్వకపోతే చర్యలు తప్ప వన్నారు. డాక్టర్ రవళి ప్రియాంక మాట్లాడుతూ ఇంటింటికి క్యాన్సర్‌పై స్కీనింగ్ సర్వే జరుగుతుందని చెప్పారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. పశువైద్యాధికారి ఈమని శ్రీసాయి మాట్లాడుతూ పశువులకు ఉచితంగా గాలి కుంటు టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. ఏవో కె.రాధ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేసుకొన్న రైతుల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

సమావేశంలో వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం, ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య, ఈవోపీఆర్డీ అరవిందరెడ్డి, ఎంఈవో డీవీ సుబ్బారావు, ఏఈ రాజమోహన్‌రెడ్డి మండల కోఆప్షన్ సభ్యుడు నాయబ్‌రసూల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

ఆశాజనకంగా కరివేపాకు



పసుపుగల్లులో సాగుచేసిన కరివేపాకు

ముండ్లమూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సాగుచేసిన కరివేపాకు తోటలు ఆశాజనకంగా ఉన్నాయి. గత వారం రోజుల నుంచి మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది. ప్రస్తుతం కేజీ రూ. 30 నుంచి రూ.35 వరకు పలుకుతుంది. దీంతో ఎకరానికి రూ.50వేలకు పైగానే ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు. రెండు నెలల క్రితం కరివేపాకు సాగుచేసిన రైతులకు ధర లేకపోవడంతో నష్టపోయారు. మండలంలోని పసుపుగల్లులో అత్యధికంగా వంద ఎకరాల్లో సాగు చేశారు. తమ్మలూరు, చింతలపూడి, ఉల్లగల్లు, సింగనపాలెం, శంకరాపురం, నూజెండ్లపల్లి, కమ్మవారిపాలెం, వేముల ప్రాంతాల్లోనూ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రైతుల వద్దకే వచ్చి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. మరికొంతమంది రైతులు తోటల్లోనే ఆకును కోసి నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, గుంటూరు, విజయవాడ, ఒంగోలు, పొదిలి పట్టణాలకు వెళ్ళి అమ్ముకుంటున్నారు. మరో నెలరోజుల పాటు ఇదే ధర ఉంటే గత రెండు సంవత్సరాలుగా నష్టపోయిన రైతులు ఈసారి ఒడ్డునపడతామని పేర్కొంటున్నారు.

20న సీపీఎం ధర్నా

దొనకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వెలిగొండతోనే దొనకొండ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని సీపీఎం నాయకుడు చిరుపల్లి అంజయ్య పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించి పనులు పూర్తిచేసి సాగునీరు ఇవ్వాలనే డిమాండ్‌తో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సీపీఎం చైతన్యయాత్ర నిర్వహించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న మార్కాపురంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాండవ రంగారావు మాట్లాడుతూ దొనకొండ ప్రాంతం అభివృద్ధికి వెలిగొండ ప్రాజెక్టు, పారిశ్రామిక కారిడార్ రావటంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో చిన్ననర్సింహులు, కిరణ్‌కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పగిలిన మంచినీటి పైప్‌లైన్

» వృథాగా పోతున్న సాగర్ జలాలు

దొనకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మంచినీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో సాగర్ జలాలు వృథాగా పోతున్నాయి. చందవరం-1 సాగర్ జలాల స్టోరేజీ నుంచి మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. బాదాపురం గ్రామ సమీపంలోని సాగర్ జలాల పైప్‌లైన్‌ను కొందరు పశుపోషకులు జీవాల దాహార్తి తీర్చేందుకు పగులకొట్టారు. దీంతో సాగర్‌నీరు సమీపంలోని గుంతలకు చేరుతుంది. ఇప్పటికీ ఐదుసార్లు పైప్‌లైన్ పగులకొట్టారని సంబంధిత శాఖ సిబ్బంది తెలిపారు.

సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పైప్‌లైన్ పగులకొట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టి వేసవిలో నీటిసమస్య తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

← బాదాపురం గ్రామ సమీపంలో పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న సాగర్ జలాలు

మేత కోసం వలసబాట

సీఎస్‌పురం(పామూరు), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మేత కోసం ఆవులు వలసబాట పట్టాయి. కనిగిరి ప్రాంతంలో గ్రాసం కొరత తీవ్రమైంది. దీంతో వాటి యజమానులు మేత కోసం వేరేప్రాంతాలకు తరలించుకుపోతున్నారు. సీఎస్‌పురం మండలంలోని డీజీపేట అంబవరం, పెదగోగులపల్లి, కంభంపాడు, నాగులారం, ఏకునాంపురం, తదితర గ్రామాలనుంచి తరలిస్తున్నారు. పశుగ్రాసం కోసం అద్దంకి, దరిశి, పొదిలి ప్రాంతాలకు రోడ్డుమార్గాన తరలివెళుతున్నాయి. ఈసందర్భంగా పశుపోషకులను విచారించగా ఈ ప్రాంతంలో సరైన వర్షాలు కురవకపోవడంతో గ్రాసం కరువైందని తెలిపారు. మూడు నెలలపాటు మేత లభ్యమైన ప్రాంతంలో ఉంటామని తెలిపారు. మళ్లీ వర్షాలు కురిసేసమయానికి స్వగ్రామాలకు వస్తామని పేర్కొన్నారు.



మేత కోసం దూర ప్రాంతాలకు తరలివెళుతున్న ఆవులు



తూర్పుగంగవరంలో చెత్తసంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో పద్మ

చెత్తసంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం

తాళ్లూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తసంపద తయారీకేంద్రాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తామని డీఎల్‌పీవో పద్మ తెలిపారు. తద్వార పంచాయతీలకు ఆదాయం వస్తుందని చెప్పారు. ఆదివారం తూర్పుగంగవరంలోని చెత్తసంపద తయారీ కేంద్రంలో తయారు చేస్తున్న వర్మి కంపోస్టును పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తసంపద తయారీ కేంద్రాలు వాడుకలో లేకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. నిధులు సమకూర్చి చెత్త సంపద కేంద్రాలకు మరమ్మతులు చేయిస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లో ఇంటి పన్నులను వసూలు చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించారు. ఇంటిపన్నులు చెల్లించిన గృహ యజమానులకు రసీదులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.అజయ్‌కీర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహా నైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించారు. గోసాలలోని గోవులకు పసుపు కుంకుమతో పూజలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'సాగుదారులను ఇబ్బందులు పెడుతున్నారు'

పామూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మలంపాడులోని సర్వే నెంబరు 1,3,4,5లోగల 41.21 ఎకరాల ప్రభుత్వ గయాల భూమిని 9 మంది రైతులు సాగుచేసుకుంటున్నారు. అందులో ఉద్యాన పంటలైన బత్తాయి, మామిడి, యాపిల్‌బేర్, తదితర పంటలను గత 20ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారు. ఈభూమిపై కన్నుపడిన రిటైర్డ్ ఉద్యోగి గత ప్రభుత్వంలో 9మంది రైతులపై కేసులు నమోదు చేయించాడు. అధికారులను లోబరుచుకొని నకిలీ ప్రొసీడింగ్ కాగితాలను పుట్టించి ఆభూమిని కొట్టేశాడు. పోలీస్‌స్టేషన్‌లో కేసులు బనాయించి తమని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బాధిత రైతులు వాపోతున్నారు.

మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడుకు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. ఆయన ఆదేశాలను కిందిస్థాయి అధికారులు అమలు పరచ డంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన ఎస్ఆర్ నెంబర్ నకిలీదని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నెంబర్‌ను తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద అడిగితే ఇవ్వ డంలేదని చెప్పారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కాశిరెడ్డి సేవలు అభినందనీయం

వెలిగండ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శ్యామం వెంకటరెడ్డి ఫౌండేషన్ ద్వారా టీడీపీ నాయకుడు శ్యామం కాశిరెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక కెనరా బ్యాంకు ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశిరెడ్డి ప్రతియేటా తన తండ్రి వెంకటరెడ్డి పేరుమీద విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, చిలకల వెంకటేశ్వర రెడ్డి, కేసరి రమణారెడ్డి, మీనిగ కాశయ్య, కారంపూడి వెంకటేశ్వర్లు, చౌడారెడ్డి, లక్ష్మీనారాయణ, బండి శ్రీను, రాజగోపాల్, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి నీటి సౌకర్యం కల్పించాలి

పామూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదిరెడ్డిపల్లి గ్రామ సచివాలయానికి నీటి సౌకర్యం కల్పించేందుకు మండల గ్రాంటు నుంచి నిధులు మంజూరుచేయాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్యకు ఆదివారం ఎంపీటీసీ మెడబలిమి ఆదిలక్ష్మి వినతిపత్రం అందజేశారు. దాదిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం ప్రారంభానికి ఎదురు చూస్తుందని తెలిపారు. సచివాలయానికి బోరు, విద్యుత్ మోటారు, వాటర్ ట్యాంకు సౌకర్యం లేదన్నారు. ఎంపీడీవోను కలిసిన వారిలో ఉపసర్పంచ్ కె.రామసుబ్బారెడ్డి, ఎం.బ్రహ్మయ్య ఉన్నారు.

హోటల్‌లో గ్యాస్‌లీకై మంటలు

పీసీపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): హోటల్‌లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. స్థానికులు అప్రమత్తమై నీళ్లు చల్లడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఆదివారం రాత్రి మండలంలోని పెదయిర్లపాడులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పెదయిర్లపాడు సెంటర్‌లో రవి అనే వ్యక్తి టిఫిన్ హోటల్ నిర్వహిస్తున్నాడు. రోజులాగే ఆదివారం సాయంత్రం టిఫిన్ తయారు చేస్తుండగా గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ వద్ద గ్యాస్ లీకైంది. దీంతో మంటలు వ్యాపించడంతో హోటల్ నిర్వాహకులు భయంతో బయటకు పరుగులు తీశారు.

ఎగిసిపడుతున్న మంటలను గమనించి స్థానికులు అప్రమత్తమై పక్కనే ఉన్న ఇతర దుకాణాలు, ఇళ్లు, హోటళ్లకు మంటలు వ్యాపించకుండా బిందెలు, బక్కెట్లతో నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. పెద్దప్రమాదం తప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా అమరజీవి జయంతి

ముండ్లమూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆదివారం ముండ్లమూరులో నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో అమరజీవి విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పులికొండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవతి శ్రీనివాసరావు, ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, పులికొండ బ్రహ్మేశ్వరరావు, వెంకటరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట ప్రాంతంలో పనులు చేస్తున్న ఉపాధి కార్మికులు

- నేటి నుంచి పది పరీక్షలు.. ఏర్పాట్లు పూర్తి
- ఫిర్యాదుల కోసం డీఈవో కార్యాలయాల్లో హెల్ప్‌లైన్
- హాల్‌టిక్కెట్‌పై విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

గంట ముందే కేంద్రాల్లోకి అనుమతి

బాపట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను ఆయా కేంద్రాల్లోకి గంట ముందు అనుమతిస్తామని విద్యాశాఖాధికారులు తెలిపారు. గంట ముందుగా అంటే ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకుంటే ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉంటుందని సూచిస్తున్నారు. రోజు మార్చి రోజు నిర్వహిస్తున్నందున పరీక్షకు సిద్ధమ య్యేందుకు విద్యార్థులకు సమయం దొరు కుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్షలపై వచ్చే ఫిర్యాదుల కోసం విద్యాశాఖ కార్యాలయాల్లో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లోకి ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని, పరీక్ష జరిగే కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాల ని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉద యం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు అంటే ఎండల సమయంలో పరీక్షలు జరుగు తున్నందున విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. కేంద్రాల వద్ద వైద్య సేవలకు ఏఎన్ఎమ్‌లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులను కూడా అందుబాటులో ఉంచారు. ఏ ఒక్క విద్యార్థి కూడా కింద కూర్చోకుండా బెంచీలతో పాటు గాలి, వెలుగు ప్రస రించేలా ఆయా గదుల్లో ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల సౌకర్యం కోసం హాల్ టిక్కెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిం చింది. అంతేగాకుండా కేంద్రాల వద్దకు అవసరాన్ని బట్టి ప్రత్యే క బస్సు లు నడిపే ఏర్పాట్లను కూడా విద్యాశాఖ చేపట్టింది.



పది కేంద్రంలో నెంబర్లు వేస్తున్న అధికారులు

బాపట్ల జిల్లాలో 103 కేంద్రాలు

బాపట్ల జిల్లాలో 103 కేంద్రాల్లో 16,799 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరిలో బాలికల సంఖ్య 8,317, బాలుర సంఖ్య 8,482. జిల్లాలో ఏ కేటగిరి కింద 33, బీ కేటగిరి కింద 41, సీ కేటగిరి కింద 29 కేంద్రాలను చేర్చి వసతుల కల్పనకు అన్ని చర్యలు చేపట్టారు. పరీక్షల నిర్వహణకు 110 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, 12 మంది రూట్ ఆఫీసర్లతో పాటు అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను నియమించారు. ఆరు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలతోపాటు 105 మంది క్లర్కులు, ఏఎన్ఎంలు, 1048 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిం చనున్నారు. 220 మంది పోలీసులతో కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసినట్లు డీఈవో పురుషోత్తం తెలిపారు. పరీక్షల నిమిత్తం జిల్లాకు నోడల్ ఆఫీసర్‌గా, పరిశీలకురాలిగా విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ గంగాభవానిని ప్రభుత్వం నియమించింది.

పనులు చేసినా.. పస్తులే

వలసలు నివారించి.. స్థానికంగా పనులు కల్పిస్తూ.. కూలీలకు అండగా ఉపాధి హామీ పథకాన్ని అధికారులు అమలు చేయాలి. అయితే కూలీలతో పనులు చేయించుకుని వారికి ఇవ్వాల్సిన కూలి నగదును పెండింగ్ పెడుతున్నారు. పనులు చేసినా పస్తులు ఉండాల్సి వస్తుందని కూలీలు వాపోతున్నా అధికారులు ఆలకించడంలేదు. ఒకటి రెండు రోజులు అయితే పర్వాలేదు కానీ రెండు నెలలుగా కూలీలతో పనులు చేయించుకుని రూ.41.25 కోట్లు బకాయి పెట్టారంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. పనులు చేశాము.. ఖాతాల్లో నగదు జమ అవు తుందని కూలీలు రోజుల తరబడి ఎదురుచూస్తున్నా వారి ఆశలు అడియాశలవుతున్నాయి. జనవరి 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు పనులు చేసిన కూలీలకు ఉపాధి సొమ్ములు చెల్లించలేదు. పనులకు సంబంధించిన సామగ్రి బిల్లుల బకాయిలు కూడా రూ.131.06 కోట్లు ఉన్నాయి.

- ఉపాధి కూలీల ఆకలి కేకలు
- రెండు నెలలుగా అందని కూలి
- కూలీలకు రూ.41.25 కోట్లు.. సామగ్రికి రూ.131.06 కోట్ల బకాయి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి కూలీలు.. వేతనాలు అందక అల్లాడుతున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు రూ.41.25 కోట్లు బకాయిలు ఉండటంతో కూలీలకు వ్యథలు తప్పడంలేదు. కూలీలు చేసిన పనులకు వారం వారం కాదు కదా నెలకొకసారి కూడా కూలి చెల్లించడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వలసలు నివారించడం, వ్యవసాయ కార్మికులు, కూలీలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో లోపాలు చోటు చేసుకుంటున్నాయి. చేసిన పనికి రెండు రోజుల్లో ప్రతి కార్మికుడికి కూలి సొమ్ము వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయాల్సి ఉండగా చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. చేసిన పనికి వెను వెంటనే కూలి రాకపోతుండటంతో ఉపాధి పనులపై కార్మికులు ఆసక్తి చూపడంలేదు. ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది కూలీల వారీగా వారికి చెల్లించాల్సిన కూలి వివరాలను మండల కార్యాలయానికి పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్లో నమోదు చేసిన రెండు రోజులకు వారి ఖాతాల్లో నగదు జమ చేయాలి. కూలి వివరాల సేకరణ.. ఆన్‌లైన్‌లో నమోదు.. తదితర ప్రక్రియలు సక్రమంగా జరుగుతున్నా నగదు మాత్రం వారి ఖాతాల్లో జమ కావడంలేదు. జనవరి 15 నుంచి కూలి చెల్లించడంలేదు.

జాబ్ కార్డులు ఇలా..

పల్నాడు జిల్లాలో అత్యధికంగా జాబ్ కార్డులు నమోదు చేశారు. 5.77 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేయగా 4.53 లక్షల కార్డులు మాత్రమే యాక్టివ్‌లో ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 2.09 లక్షల కార్డులకు 1.51 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.72 లక్షలకు 3.74 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. నమోదు చేసుకున్న వారందరూ పనులకు హాజరు కావడంలేదు. పేరు నమోదు చేసుకోని కూలీల సంఖ్యలో లక్షల్లో ఉంది. వీరికి కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఉపాధి పనుల్లో కార్మికుల పని దినాలను ముందుగానే అంచనా వేస్తున్నా ఆ మేరకు పని దినాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి.

బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణ పనులు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పెద్దఎత్తు జరిగాయి. గోకులం షెడ్ తదితర పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు సకాలంలో జరగడంలేదు. పూర్తయిన పనులకు నెలలు తరబడి బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. పల్లెపండుగ పథకం ప్రారంభంలో వారం.. వారం బిల్లుల చెల్లింపులు మొదటి రెండు వారాలు మాత్రమే జరిగాయి. ఆ తర్వాత నుంచి బిల్లుల చెల్లింపులు ఆగి పోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పల్నా డు జిల్లాలో రూ.61.90 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.44.12, గుంటూరు జిల్లాలో రూ.15.04 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. కమిటీల పర్యవేక్షణలో చేపట్టిన పనులకు కూడా చెల్లింపుల్లో జాప్యం జరుగు తుండటంతో నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. కాగా పనులకు సంబం ధించిన బిల్లులను అప్‌లోడ్ చేశామని పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తెలిపారు.

వేసవి భత్యాలు రద్దు

గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20, మార్చిలో 25, ఏప్రిల్లో 30 శాతం అదనపు కూలి ఇచ్చేవారు. మజ్జిగ కూడా సరఫరా జరిగేది. తాగునీటికి రూ.5, గునపానికి రూ.10, తట్టకి రూ.13 చెల్లించేవారు. ప్రస్తు తం వీటినీ రద్దు చేశారు. దీంతో వేతన దారులపై ఆర్థికభారం పడుతోంది.

రూ.27 కోట్లతో.. రోడ్ల అభివృద్ధి

- గోతుల రోడ్లపై వాహన చోదకులకు తప్పిన తిప్పలు
- తారుతో డబుల్‌రోడ్డుగా రేపల్లె-బాపట్ల-పెనుమూడి రహదారి

రేపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ హయాంలో గోతుల రోడ్లతో వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అలాంటిది ప్రస్తుత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రహదారులు అభివృద్ధి చెయ్యాలంటూ టీడీపీ, జనసేనతో పాటు ఆయా గ్రామాల ప్రజలు ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా కనీసం గుంతలు పూడ్చని పరిస్థితి గతంలో నెలకొన్నది. గత పది నెలల కాలంలో ప్రత్యేకంగా రూ.27 కోట్లతో రేపల్లె ప్రాంతంలో రోడ్లను సుందరంగా తీర్చిద్దారు. గోతుల రోడ్లతో బస్సులు తిప్పే పరిస్థితి లేదని, తరచూ మరమ్మతులతో బ్రేక్‌డౌన్ అవుతున్నాయని ఆర్టీసీ అధికారులు మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి గతంలో తెలిపారు. రోడ్లు అభివృద్ధి చేయకుంటే బస్సులు తిప్పలేమని చెప్పారు. రేపల్లె- పెనుమూడి రోడ్డు గుంతలుమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. దీంతో స్పందించిన మంత్రి భట్టిప్రోలు నుంచి రేపల్లె రేపల్లె నుంచి పెనుమూడి హైవే వరకు రహదారిని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయించారు.

రేపల్లె - భట్టిప్రోలు - చెరుకుపల్లి, కర్లపాలెం, బాపట్ల వరకు పాతహైవేకి రూ.27 కోట్లు మంజూరు చేయించారు. బాపట్ల నుంచి రేపల్లె, పెనుమూడి హైవే వరకు పనులు పూర్తి చేశారు. పాత హైవే అంతా డబుల్ లైన్ తారురోడ్డుగా అభివృద్ధి చేయడంతో ఐదేళ్ల నరకం చూసిన తీరప్రాంతవాసులు మంత్రికి కృతజ్ఞత లు తెలిపారు. పాతపట్నంలో ప్రధాన రహదారి వద్ద మురుగునీరు పోయే పరిస్థితి లేకపోవడంతో రూ.16 లక్షలతో కల్వర్టు నిర్మాణం చేయించారు.



తారురోడ్డుగా అభివృద్ధి చేసిన రేపల్లె-పెనుమూడి రోడ్డు



రేపల్లె-భట్టిప్రోలు తారురోడ్డుగా అభివృద్ధి

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.24 సోమవారం (సాయంత్రం)

సహరి : 4.58 మంగళవారం (ఉదయం)

నోటీసులే.. చర్యలేవి?

- ప్రభుత్వ భూముల్లో రొయ్యల సాగు
- అధికారిక లెక్కల ప్రకారం 11,500 ఎకరాల్లో..
- నివేదికలంటూ కాలయాపన చేస్తోన్న అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అనుమతులు లేకుండా, ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్న రొయ్యల చెరువుల యజమానులకు నోటీసులు జారీ చేసి వివరణ సంతృప్తికరంగా లేకపోతే చెరువులను ధ్వంసం చేయాలని ఎన్‌జీటీ 2023లో ఆదేశాలు ఇచ్చింది. 5,000 ఎకరాల అనధికార ఆక్వా సాగు కాస్తా వైసీపీ ప్రభుత్వంలో 11,500 ఎకరాలకు చేరగా అప్పట్లో ఎన్‌జీటీ ఆదేశాలను మమ అనిపించారు. అక్రమార్కులంతా కూడా దాదాపు వైసీపీ నేతల ఆశీస్సులున్న వారే కావడంతో అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడలేదు. అయితే ఆయా యజమానులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వివరణలంటూ హడావిడి చేశారే తప్ప చర్యలు శూన్యం. అయితే అప్పట్లో చూసీచూడనట్లు ఉన్న అధికారులు ఇప్పుడు కూడా అదే ధోరణిలో ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది జూలైలో కలెక్టరేట్‌లో జరిగిన తొలి అధికారిక సమీక్షలోనే నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న రొయ్యల సాగు అంశం చర్చకు రాగా నివేదిక ఇవ్వాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ మత్స్యశాఖను ఆదేశించారు. దీంతో అప్పట్లో వారం రోజులు పరిశీలన, నివేదికలంటూ హడావిడి చేశారు. అయితే నివేదికలను మంత్రికి సమర్పించారో లేదో స్పష్టత ఇవ్వడంలో ఇప్పటికీ మత్స్యశాఖ గందరగోళంలోనే ఉంది. 11,500 ఎకరాల్లో అనధికారికంగా రొయ్యల సాగు చేస్తున్నట్లు గుర్తించి ఇటీవల నోటీసులు జారీ చేశారు. వైసీపీ హయాంలో జరిగిన చందంగానే ఇప్పుడు కూడా అదే రీతిన అధికారుల తీరు కనిపిస్తుండం, మంత్రి ఆదేశాలనే బేఖాతరు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిబంధనల ప్రకారం సాగు చేపట్టే చిన, సన్న కారు ఆక్వా రైతులు రోజురోజుకు ఊబిలో కూరుకుపోతుంటే ప్రభుత్వ భూములను దర్జాగా అనుభవిస్తూ కోట్లు గడిస్తున్న బడాబాబులు మాత్రం అధికారులను తమ చెప్పు చేతల్లో ఉంచుకుని పబ్బం గడుపుకుంటున్నారు.



అనుమతులు లేకుపోయినా రాయితీలు..

జిల్లా వ్యాప్తంగా 21,000 ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. ఇందులో 9,500 ఎకరాలు మాత్రమే రిజిష్టర్డ్ సాగు కాగా మిగిలిన 11,500 ఎకరాలు అంతా నిబంధనల ఉల్లంఘనే. భూములను రొయ్యల సాగుకు అనువుగా మార్చాలంటే పలు అనుమతులు తీసుకోవాలి. తహసీల్దార్ మొదలుకుని, అటవీ, విద్యుత్, భూగర్భ జలవనరుల శాఖలన్నీ అనుమతి ఇచ్చాక కోస్తా ఆక్వా కల్చరల్ అథారిటీ(సీఏఏ)తో పాటు మత్స్యశాఖ వద్ద రిజిష్టర్ చేసుకోవాలి. కానీ ఇవేవీ పాటించకుండానే జిల్లాలో వేల ఎకరాల రొయ్యల చెరువులకు యథేచ్ఛగా విద్యుత్ అందుతోంది, లైసెన్సు లేకుండానే రాయితీ ఫలాలు అందుకుంటున్నారు. మామూళ్ల మత్తులో ఆయా శాఖలు జోగుతుండడం వల్లే అనధికార రొయ్యల సాగు పెరుగుతుందని అర్థమవుతోంది. ఎన్‌జీటీ ఆదేశాలనే పట్టించుకోకుండా ప్రభుత్వ, అసైన్డ్ భూములను చెరబట్టి రొయ్యల సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు కూడా ప్రజల నుంచి పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఎన్‌జీటీ ఆదేశాల ప్రకారం రెండేళ్ల క్రితం జిల్లాలో దాదాపు 3,000 మంది రొయ్యల సాగు యజమానులకు మత్స్యశాఖ నోటీసులు జారీ చేసింది. వారి వద్ద నుంచి వివరణ రాలేదు.

ఆక్వాకు పునర్‌వైభవానికి చర్యలు

కాలుష్యాన్ని తగ్గించి లాభసాటి విధానాలు అవలంభించి రొయ్యల సాగు ఎలా చేయాలనే దానిపై జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద రెండు క్లస్టర్లను ఎంపిక చేసి 400 మంది రైతులకు ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. ఆక్వాకు పునర్‌వైభవం కల్పించడంతో పాటు అనేక రకాల ప్రోత్సాహకాలకు ప్రభుత్వం నాంది పలికింది. ఎగుమతులకు సాధికారత కల్పించడం, బీమా, జియో ట్యాగింగ్‌తోపాటు స్థానికంగా రొయ్యల వినియోగాన్ని పెంచేలా చర్యలు చేపట్టడం ఆక్వారంగం పురోగతికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలలో ముఖ్యమైనవి. నిబంధనలకు లోబడి సాగు చేసే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందనే సంకేతాలను పంపించగలిగింది.

కర్ణాటక మిర్చి కట్టడి!

- వాటి వలనే ఇక్కడి రకాలకు ధర రావడం లేదని రైతుల భావన
- అక్కడి నుంచి ఎక్కువగా మిర్చిని తెప్పించడంలో వ్యాపారుల పాత్ర
- ఈ వారంలోనే మార్కెటింగ్ శాఖ నిర్ణయం తీసుకునే అవకాశం

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఇబ్బడి ముబ్బడిగా గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)ని ముంచెత్తుతోన్న కర్ణాటక రాష్ట్ర మిర్చిని కొంతమేరకు కట్టడి చేయా లని మార్కెటింగ్ శాఖ భావి స్తున్నది. మార్కెట్‌కి నిత్యం రైతులు తీసుకొస్తున్న లక్షా 30 వేలకు పైగా మిర్చి టిక్కీల్లో 50 శాతం వరకు ఆ రాష్ట్రానికి చెందిన రైతులు తీసుకొస్తున్నవే ఉంటున్నాయి. పైగా అవి అధిక తేమ శాతంతో కూడుకుని ఉంటుండటంతో వ్యాపారస్థులు ధర పెంచ డంలేదు. ఆ మిరపకాయలను కోల్డ్‌స్టోరేజ్‌లలో కూడా నిల్వ చేయలేని పరిస్థితి ఉండటంతో వ్యాపారస్థులు నిర్ణయించిన ధరకు విక్రయిస్తున్నారు. దీంతో ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి రైతులు తీసుకొస్తున్న మిర్చికి కూడా ధర రావడం లేదు.



ప్రస్తుతం మిర్చియార్డుకు ఎక్కువగా కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి, హంప్లీ, హోస్‌పేట తదితర ప్రాంతాల నుంచి రైతులు మిర్చిని ఎక్కువ మోతాదులో తీసుకొస్తున్నారు. వీళ్లతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ చుట్టుపక్కల నుంచి కూడా రైతులు మిర్చిని ఇక్కడికి తీసు కొచ్చి విక్రయిస్తున్నారు. ఇందుకు కారణం ఆయా రాష్ట్రాలతో పోల్చితే ఇక్కడ వ్యాపారస్థులు ఎక్కువ సంఖ్యలో ఉండటం, మిర్చిని అమ్మిపెట్టిన రోజునే నగదుని వాళ్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండటమే. అయితే ప్రస్తుతం అక్కడి రైతులు మూడో కోత మిరపకాయలను తీసుకొస్తు న్నారు. సరిగా ఆరబెట్టకుండా తెచ్చేస్తున్నారు. అలానే వాటిల్లో తాలుకాయల శాతం కూడా ఎక్కువగానే ఉంటున్నది. ఈ మిర్చి టిక్కీలను విప్పి చూస్తూనే ఎక్స్‌పోర్టర్లు ధర తగ్గించేస్తున్నారు. అలానే బంగ్లాదేశ్‌లో రంజాన్ పండగ కారణంగా అక్కడి నుంచి దిగుమతి ఆర్డర్లు తక్కువగా ఉంటున్నాయని మిర్చి కమీషన్ వ్యాపారి పమిడి కృష్ణ తెలిపారు.

వారంలో ఐదు రోజులు మాత్రమే వాణిజ్యం జరిగే గుంటూరు మిర్చియార్డులో వ్యాపారస్థుల అంచనా ప్రకారం కర్ణాటక నుంచి లక్షన్నర టిక్కీల వరకు వస్తున్నాయి. తెలంగాణ నుంచి 15 వేల టిక్కీల వరకు వస్తున్నట్లు చెబుతున్నారు. వీటి ప్రభావం మార్కెట్‌పై గణనీయంగా ఉంటున్నది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల నుంచి మిర్చిని ఏప్రిల్ మొదటి వారం వరకు కట్టడి చేయాలని మార్కెటింగ్ అధికారులు భావిస్తున్నారు. కోత జరిగిన తర్వాత కనీసం మూడు వారాల పాటైన ఎండబెట్టుకుని తీసుకురావాలని కోరేందుకు సిద్ధమయ్యారు. దీనివలన ఇక్కడి మిర్చి రకాలకు డిమాండ్ పెరిగి ధర క్వింటాల్ రూ. 15 వేలు దాటిపోతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తేజ రకం మిర్చికి రూ. 11,500 మాత్రమే లభిస్తున్నది. టాప్ క్వాలిటీ అయితే రూ. 13 వేలు వస్తున్నది. మిగిలిన రకాలకు రూ. 9,500 నుంచి రూ. 11,500 వరకే ధర లభ్యమౌతున్నది.

అమరజీవి త్యాగంతో తెలుగుజాతికి గుర్తింపు

- పొట్టిశ్రీరాములు జయంతిలో కలెక్టర్ వెంకటమురళి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్ తదితరులు

బాపట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రాణ త్యాగంతో తెలుగు జాతికి గుర్తింపు తెచ్చిన అమరజీవి పొట్టి శ్రీరాములను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆదివారం బాపట్ల ఏరియావైద్యశాలలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పొట్టిశ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహింస మార్గంలో ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన మహనీయులు పొట్టిశ్రీరాములని కొనియాడారు. తమిళనాడులో మిళితమైన తెలుగు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను గుర్తించటమేకాకుండా విశేషంగా పోరాడిన గొప్పయోధుడన్నారు. ఆంధ్రరాష్ట్రం కావాలని చేపట్టిన పోరాటంలో తన ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ మాట్లాడుతూ దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటుకు ఆద్యుడు పొట్టి శ్రీరాములేనన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి శివలీల, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈవో ఎస్.పురుషోత్తం, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, నాయకులు బూర్లె రామసుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

చీరాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : డివిజనల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం నిమిత్తం మంగళవారం విద్యుత్ అదాలత్, అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ముంతావారి సెంటర్‌లోని బాపనమ్మ కల్యాణ మండపంలో ఉదయం 10:30.ని నుంచి మధ్యాహ్నం 1:30.ని వరకు కార్యక్రమం జరుగుతుందని వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేకాట స్థావరంపై ట్రైనీ డీఎస్పీ దాడి

వాడరేవు(చీరాల), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు చినబరప సమీపంలోని సపోటా తోటలో జరుగుతున్న పేకాటపై ట్రైనీ డీఎస్పీ అభిషేక్ దాడులు నిర్వహించారు. ఈక్రమంలో 6 గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అలాగే రూ.2520 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఆయన వెంట పలువురు ఈపూరుపాలెం స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ముగ్గురు అరెస్టు

మేదరమెట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొల్లవరప్పాడు శివార్లలో జరుగుతున్న కోడి పందేలపై కొరిశపాడు ఎస్ఐ సురేష్ సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. అప్పుడే కోడి పందెలు మొదలు పెట్టడంతో పోలీసులను చూసి పందెంగాళ్లు పరుగులంకించుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, రూ.1200 నగదు, పందెం పుంజును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మేమున్నామని గుర్తించండి

- తాగునీటికి ఇబ్బందులు
- కనీస వసతులు కరువు
- నక్కలవారిపాలెంవాసుల మొర

నక్కలవారిపాలెం(చీరాల), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కావూరివారిపాలెం పంచాయతీ నక్కలవారిపాలెం గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం తహతహలాడుతున్నారు. ఈ గ్రామం మండలానికి దాదాపు శివారు ప్రాంతం. అలాగే పంచాయతీకి సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. దీంతో ఆ గ్రామంలో ప్రజలు ఉన్నట్లు కూడా అధికారులు గుర్తించకపోవడం విశేషం. ఇక్కడ సుమారు 150 కుటుంబాలు నివాసం ఉండగా, 300 మంది వరకు చిన్నా, పెద్ద, వృద్ధులు ఉంటున్నారు. తాగునీరు లేక వాళ్లంతా విలవిల్లాడుతున్నారు. మరో వైపు మార్చి ప్రారంభం నుంచే ఎండలు మండిపోతున్నాయి. పల్లెల్లో ప్రజలకు నీటి ఎద్దడి అధికంగా ఉంటుంది. ప్రారంభంలోనే ఇలావుంటే ఏప్రిల్, మే నాటికి ఎండలు ముదురి మంచి నీటికి కటకటలాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోడ్ల వెంబడి ట్యాపులను అమర్చారు. కానీ అవి శిథిలదశకు చేరినా చుక్క నీరు కూడా సరఫరా కాలేదు. వీరికి మౌలిక వసతులు అందని ద్రాక్షగానే ఉన్నాయి. ఒకవేళ ఏదయినా ప్రభుత్వం నుంచి సాయం అందాలన్నా, ప్రభుత్వ కార్యక్రమాలు జరగాలన్నా ఈ ప్రాంతం ఉన్నట్లు కూడా అధికార యంత్రాంగానికి గుర్తులేకపోవడం శోచనీయం. అన్ని ప్రాంతాల్లో కార్యక్రమాలు ముగిశాక ఒకవేళ సమయం ఉంటే జరిగి జరగనట్లుగా ఏదో చేయాలి కదా అన్నట్లుగా ఇక్కడ కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో గ్రామానికి తాగునీరు లేక, రహదారులు వంటివి అరకొరగా ఉండి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఏది కావాలన్నా కొనుగోలుకు సుమారు 4 కిలో మీటర్ల దూరం ప్రయాణం చేసి బాపట్ల మండలం వెదుళ్లపల్లికి వెళ్లాల్సిందే. అయితే ఆ మార్గంలో విద్యుత్ దీపాల ఊసే లేదు. రాత్రయితే ప్రయాణం భయం భయం. చిన్నారులు సైతం వెదుళ్లపల్లి స్కూల్‌కు వెళ్లి ఇంటికి చేరేందుకు విద్యుత్ దీపాల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో ఆ ప్రాంత వాసులు మేమూ మనుషులమేనని, మా బాధలు గుర్తించండి అంటూ వేడుకుంటున్నారు.



నక్కలవారిపాలెం ప్లా పనిచేయని మంచినీటి ట్యాపు

విద్యుత్ దీపాల సౌకర్యం లేదు



గ్రామం నుంచి మరో గ్రామానికి మూడు కిలో మీటర్ల దూరం ఉంది. ఈక్రమంలో మా గ్రామం చుట్టూ ఏడు దాటితే పొలాలు కావడంతో బిక్కుబిక్కు మంటున్నాం. విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో పొరుగూరుకు చదువు కోసం వెళ్లి వచ్చే చిన్నారులు చీకట్లోనే రాకపోకలు చేయాల్సిన దుస్థితి ఉంది. అధికారులు మా సమస్యలపై దృష్టి సారించాలి.

- కందుల కల్యాణ్‌రామ్, గ్రామస్థుడు

తాగునీటికి అవస్థలు



గ్రామంలో ఏళ్ల తరబడి తాగునీటి సౌకర్యం లేక నానా తంటాలు పడుతున్నాం. ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ మా బతుకుల్లో మార్పు లేదు. రోజూ తాగునీటికి తిప్పలే. కూటమి ప్రభుత్వమైనా సమస్యలు పరిష్కరించాలి.

- మధుసాని శ్రీనివాసరావు, గ్రామస్థుడు

నేడు మెగాజాబ్ మేళా

మార్టూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగుల కోసం మెగాజాబ్ మేళా కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. దాదాపుగా 20 కంపెనీలలో 3 వేల జాబ్‌ల కోసం నిరుద్యోగులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశ్యంతో మెగాజాబ్ మేళాను ఏర్పాటు చేశారు. టెన్త్, ఇంటర్, బీటెక్, ఫార్మా, నర్సింగ్ తదితర విభాగాలలో ఉద్యోగాలకు ఎంపిక నిర్వహిస్తారు.

టీడీపీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ

చినగంజాం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వం తీసుకున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, శ్రీనివాసరావు, నాయకులు చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీర్ల గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

బల్లికురవ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రసిద్ధి చెం దిన వీర్ల గంగమ్మ తల్లి దేవాలయం లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున గంగమ్మ తల్లిని దర్శించుకొని పూజలలో పాల్గొన్నారు.

19న రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల

బల్లికురవ. మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఈనెల 19వ తేదీన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ వార్షిక తిరునాళ్ల జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. గ్రామ పరిసర గ్రామాల భక్తులు తిరునాళ్లకు విచ్చేసి జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

పీఆర్ నాల్గో తరగతి ఉద్యోగుల ఎన్నిక ఏకగ్రీవం

చీరాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఐక్యమత్యంతో పాటుపడి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఉమ్మడి ప్రకాశం నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు పోలయ్య అన్నారు. ఆదివారం స్థానిక మండల కార్యాలయంలో చీరాల, పర్చూరు, వేటపాలెం సమితుల కార్యవర్గం ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఈసందర్భంగా నూతన కమిటీతో ప్రతిజ్ఞ చేయించి నియామకపత్రాలను అందజేశారు. ఎలక్షన్ అధికారిగా పోలయ్య, పరిశీలకులుగా మహబూబ్ బాషా వ్యవహరించారు. మూడు ప్రాంతాల కార్యవర్గానికి అందరూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

మణికేశ్వరంలో చిరిగిన టీడీపీ ఫ్లెక్సీ

అద్దంకి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వ రం ఎస్సీ కా లనీలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఆదివారం ఉదయం చిరిగి ఉంది. నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలతో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఫొటోలతో టీడీపీ కార్యకర్తలు ఎస్సీ కాలనీ వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సుమారు రెండు నెలల కిందట ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ఉండడంతో ఏమైనా గాలులకు చిరిగిందా లేక గుర్తు తెలియని వ్యక్తులు చింపి వేశారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఏదైనా సందర్భంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కొద్ది రోజుల తరువాత తొలగిస్తే సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండే అవకాశం ఉందని, అలా కాకుండా ఎక్కువ రోజులు ఉంచడం ద్వారా సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అద్దంకి మున్సిపాలిటీలో అమలు చేసిన విధంగానే గ్రామాల్లో కూడా ఫ్లెక్సీల ఏర్పాటు తొలగింపుపై నిబంధనలు అమలు చేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.



మణికేశ్వరం ఎస్సీ కాలనీ వద్ద టీడీపీ ఫ్లెక్సీలో చిరిగిన అడుగు భాగం

నిరాటంకంగా హరేరామ నామ సంకీర్తన

చినగంజాం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : పెదగంజాం గ్రామంలోని భూనీళా సమేత భావనారాయణ స్వామి దేవస్థానంలో నిరాటంకంగా తొమ్మిది భజన బృందాలు హరేరామ నామ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. దేవస్థానంలో 19వ వార్షిక శ్రీరామకోటి సప్తాహ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 10వ తేదీ నుంచి పెదగంజాం, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భజన బృందాల సభ్యులు, భక్తులు హరే రామ నామ సంకీర్తన కార్యక్రమాన్ని చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వెంకటేశ్వరస్వామి కల్యాణ వ్యాఖ్యాత వాకాని రామకృష్ణ శేషసాయి ఆధ్వర్యంలో దేవస్థానంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆసోది దశరథరామిరెడ్డి తెలిపారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

ఘనంగా జయంతి వేడుకలు





చీరాలలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

చీరాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని, ఆయన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఆయన జయంతి వేడుకలను నియోజకవర్గం పరిధిలోని ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీరాములు జయంతివేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్రాకోసం అలుపెరగని పోరా టం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు, కో- ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో నేటి యువత ఆశయ సాధనకు పాటు పడాలని పలువురు టీడీపీ కూటమి నాయకులు అన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు ఘనంగా అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కనిగిరిలో జన్మించి తమిళనాడులో తెలుగు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో విశేష కృషిచేసిన మహనీయుడన్నారు. అహింస మార్గంలో పోరాటం చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన ఘనత శ్రీరాములదని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గజవల్లి శ్రీనివాసరావు, కౌతవరపు జనా ర్దన్, శివ రామప్రసాద్, సుబ్బయ్య, రమేష్, చంద్ర, రత్నబాబు, నాగేశ్వరరావు, పలువురు కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు. గుంటూరు రైల్వే డివిజన్ సభ్యులు పఠాన్ రాజేష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో నాగమణికుమార్ పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో భానుచంద్రమూర్తి, హరిహరరావు, రామారావు, నాగ వీరభద్రాచారి నివాళులర్పించారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామ స్తంభంలోని నిరుపేదలకు అన్నదానం చేశారు.

అద్దంకిటౌన్ : ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు తన ప్రాణాన్ని త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్ లోని శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. పాత గాంధీబొమ్మ సెంటర్‌లో శ్రీరాములు చిత్రపటానికి వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు ఊటుకూరి రామకోటేశ్వరరావు, సెక్రటరీ హనుమంతరావు, కౌన్సిలర్ రమేష్‌బాబు, ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు రామకోటేశ్వరరావు, దత్తపాదుకా క్షేత్రం అధ్యక్షుడు నాగ సూరి హనుమత్ ప్రసాద్ నివాళులర్పించారు. మైలవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు రమేష్ ఆధ్వర్యంలో చిత్రపటానికి నివాళులర్పించారు.



అద్దంకిలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

పంగులూరు : తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలొడ్డిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగధనుడని పలువురు నేతలు కొనియాడారు. పంగులూరులోని ప్రధాన కూడలిలోని అమరజీవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి మద్ది సుబ్రహ్మణ్యం, మండల కమిటీ అధ్యక్షుడు కనమర్లపూడి శివశేషారావు, సోము నాగేశ్వరరావు, ఇమ్మడిశెట్టి సుబ్బారావు, పోలిశెట్టి సీతారామయ్య, నున్నా ఆనంద్, వెంకటరావు పాల్గొన్నారు.

మార్టూరు : మార్టూరులో రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్యభవనం వద్ద గల పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

10వ తరగతి విద్యార్థులకు రవాణా కష్టాలు

- మారుమూల గ్రామాల నుంచి పరీక్ష కేంద్రాలకు బస్సులు లేకుండా చేరేదెట్టా

అద్దంకి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో 10వ తరగతి చదివే విద్యార్థులకు పరీక్షల కష్టాలు తప్పేలా లేదు. ఆ రూట్‌లలో బస్సులు ఉండే ఉచిత ప్రయాణం చేసే అవకాశం ఆర్టీసీ కల్పించింది. అయితే బస్‌లు లేని రూట్లలో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. అద్దంకి మండలంలోని మైలవరం విద్యార్థులకు బల్లికురవ మండలంలోని వైదన పరీక్షా కేంద్రం కేటాయింపు జరిగింది. మైలవరం హైస్కూల్‌లో 10వ తరతి 45 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే పరీక్షకు హాజరు కావాలంటే మైలవరం నుంచి శాంతినగర్‌కు వచ్చి అక్కడ నుంచి వైదన క్రాస్ రోడ్డు వరకు వెళ్లాల్సి ఉంది. అయితే ఇక సాయంత్రం ఇంటికి చేరాలంటే 5-30 గంటల వరకు ఆగాల్సిందే. గతంలో వైదన పరిక్షా కేంద్రం వరకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్ నడిపినా రెండు సంవత్సరాలుగా నడపడం లేదన్న సాకుతో ఆర్టీసీ అధికారులు చేతులు ఎత్తివేసినట్లు విద్యాకమిటీ చైర్మన్ కృష్ణమురళి ఆరోపిస్తున్నారు. రెండు రోజుల నుంచి చూద్దామని చెప్పి తీరా ఆదివారం వెళ్లి కలవగా అవకాశం ఉంటే వచ్చే ఏడాది ఏర్పాటు చేద్దాం... ఈ ఏడాదికి ఎలాగోలా సర్దుకుపోండి అని సలహా ఇచ్చినట్లు చెప్తున్నారు. ఇక మండలంలోని ధేనువకొండ విద్యార్థులదీ అదే పరిస్థితి. ధేనువకొండ నుంచి పరీక్ష కేంద్రమైన మేదరమెట్ల సుమారు 40 కి.మీ దూరం ఉంది. పరీక్షకు చేరాలంటే రెండు బస్సులు మారాల్సిందే. ధర్మవరం, శంఖవరప్పాడు, హైస్కూల్స్ విద్యార్థులు మార్టూరు మండలం వలపర్ల, చక్రాయపాలెం హైస్కూల్ విద్యార్థులు బల్లికురవ మండలం వైదనకు వెళ్లాల్సి ఉంది. అయితే ఆయా గ్రామాల నుంచి పరీక్షా కేంద్రాలకు నేరుగా బస్ వసతి ఉండడంతో పెద్దగా ఇబ్బంది లేదు. మైలవరం, ధేనువకొండ హైస్కూల్స్ విద్యార్థులు మాత్రం పరీక్ష రాయాలంటే ప్రైవేటు వాహనాలలో సాహసం చేస్తూ ప్రయాణించాల్సిన పరిస్థితేనని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. లేదంటే పరీక్షలు ఉన్నన్ని రోజులు కుటుంబ సభ్యులు పనులు మానుకొని ద్విచక్రవాహనాలపై తీసుకువెళ్లక తప్పని పరిస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 10వ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే సమయంలో బస్సు సమయాలు ఉండేలా చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేటి నుంచి పది పరీక్షలు

అద్దంకిటౌన్ : పదివ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అద్దంకి పరిధిలో శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, తిమ్మాయపాలెం, కాకానిపాలెం జడ్పీహెచ్‌ఎస్, శ్రీ చైతన్య, బెల్ అండ్ బెనెట్‌తో పాటు బల్లికురవ మండలంలోని వైదన జడ్పీహెచ్‌ఎస్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో-2 సుధాకరరావు తెలిపారు. మొత్తం 1353 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

బల్లికురవ : మండలంలో మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని ఎంఈవో రమేష్ తెలిపారు. బల్లికురవ ఉన్నత పాఠశాలలో 146 మంది, అంబడిపూడిలో 96 మంది, వైదనలో 246 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ఉప్పుటూరు (పర్చూరు) : పదవ తరగతి విద్యార్థులకు గ్లోరియస్ ఆగాపే చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎగ్జామ్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఉప్పుటూరు జిల్లా పరిషత్ పాఠశాల, ఎస్సీ బాలికల వసతి గృహంలోని విద్యార్థులకు ఉచితంగా పరీక్షా సామగ్రిని సొసైటీ ఫౌండర్ మాచరవపు రవికుమార్ అందజేశారు. ఈకార్యక్రమంలో వార్డెన్ అనంత లక్ష్మీ, సొసైటీ సభ్యులు ఊరబడి శంకర్ తేజ్ కుమార్, మిక్కిలి రాజేష్ కుమార్, బిల్లా అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఉన్న వ్యర్థాలు

తిరునాళ్లలో వ్యర్థాలు తొలగేదెలా?

అద్దంకి, మార్చి16(ఆంధ్రజ్యోతి): శింగరకొండ తిరునాళ్ల మిగిల్సిన వ్యర్థాలు తొలగేదారే కనపడడం లేదు. తిరునాళ్ల ఏర్పాట్లు చేయడం వరకు ప్రత్యేక దృష్టి పెట్టిన ఆయా శాఖల అధికారులు, ముగిసిన తరువాత ఉత్పన్నమయ్యే సమస్యల గురించి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. శుక్రవారం జరిగిన శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల తిరునాళ్లకు సుమారు రూ.2లక్షల మందికి పైగానే వచ్చి ఉంటారని అంచనా. భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు. తిరునాళ్లకు వచ్చిన ప్రజలు శనివారం ఉదయానికి వెళ్లిపోయారు. ఆదివారం తిరునాళ్ల ప్రాంతం చూస్తే అంతా చెత్త మయంగా దర్శనమిస్తుంది. ఆలయానికి వెళ్లే రోడ్డుతోపాటు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసిన ప్రాంతాలు, ఆయా సామాజిక వర్గాల సత్రాల వద్ద చెత్తా చెదారం తాండవిస్తుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకు పోయి ఉన్నాయి. షాపుల ఏర్పాటుకు బహిరంగ వేలం నిర్వహించి డబ్బులు వసూలు చేసిన శింగరకొండపాలెం గ్రామ పంచాయతీ అధికారులు గానీ, భక్తుల నుంచి కానుకల రూపేణా ఆదాయం వచ్చిన దేవాలయాల అధికారులు గానీ పారిశుధ్య చర్యలపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తుంది. ఏటా ఇదే సమస్య ఉత్పన్నమవుతున్నా ఉన్నతాధికారులు తగిన ఆదేశాలు ఇవ్వకపోవడం విమర్శలకు కారణమవుతుంది. ఇప్పటికైనా స్పందించి కనీసం శింగరకొండకు వెళ్లే రోడ్డు, దేవాలయం, అన్నదాన సత్రాల వద్ద శుభ్రం చేయించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నల్ల బర్లీని కొనుగోలు చేయాలి

పంగులూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు కంపెనీలు నల్ల బర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేసేలా పొగాకు బోర్డు జోక్యం చేసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డీ రమాదేవి కోరారు. మండలంలోని చందలూరు గ్రామంలో ఆదివారం దళిత కౌలు రైతులు సీపీఎం ప్రచారయాత్ర నేతల ముందు నల్ల బర్లీ సాగులో తాము పడుతున్న కష్టాలను ఏకరువు పెట్టారు ఈ ఏడాది అధిక కౌల్లు చెల్లించి ఎక్కువ విస్తీర్ణంలో నల్ల బర్లీని సాగు చేశామని చెప్పారు. సాగుకు ప్రోత్సహించిన కంపెనీలు నేడు మొఖం చాటేస్తున్నాయని రైతులు వాపోయారు. దీనిపై రమాదేవి మాట్లాడుతూ బర్లీ పొగాకును కూడా పొగాకు బోర్డు పరిధిలోకి తేవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, పార్టీ నాయకులు వినోద్‌బాబు, తలపనేని రామారావు, ప్రభాకర్, సుధాకర్, రాఘవులు, పోతారావు పాల్గొన్నారు.

పొలాల్లో విద్యుత్ మోటార్ల చోరీ

వేటపాలెం(చీరాల), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం గ్రామ శివారు పొలాల్లో విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నాయి. గతంలో సుమారు 10 మోటార్లు చోరీకాగా చోరీ తాజాగా ఆదివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన వెంకటరావుకు చెందిన పొలంలో మోటార్‌ను దొంగిలించారు. దీంతో బాధితుడు వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో జరిగిన చోరీలకు సంబంధించి పోలీసులకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదు.

రాయల్ మెరైన్‌లో యువతి బలవన్మరణం



కావూరివారిపాలెం(చీరాల), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కావూరివారి పాలెం పంచాయతీ తులసీనగర్ సమీపంలో గల రాయల్ మెరైన్ రొయ్యల ఫ్యాక్టరీలో యువతి బలవన్మరణం చెందింది. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా అరకువేలీ మండలం మడగడ పంచాయతీ దానరంగిని గ్రామానికి చెందిన కొర్రా లక్ష్మి (22) సుమారు 5 నెలల కిందట ఫ్యాక్టరీలో ప్యాకింగ్ విభాగంలో పనికి చేరింది. అయితే ఈమెతో చిన్నాన్న కుమార్తె కూడా పనిచేస్తుంది. ఈక్రమంలో ప్రతి రోజు రాత్రి ఫోన్‌లో ఎక్కువ సమయం గడిపే లక్ష్మి శనివారం పడుకునే ముందు ఫోన్‌లో ఎవరితోనే వాదన పడింది. అనంతరం అందరూ పడుకున్నాక ఉదయం లేచి చూసేసరికి లక్ష్మి మరుగుదొడ్డిలో ఉరికి వేలాడుతూ మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న ట్రైనీ డీఎస్పీ అభిషేక్ ఈపూరుపాలెం సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. తల్లిదండ్రులకు ఇప్పటికే సమాచారం అందించారు. అయితే మృతురాలి సోదరి కూడా సుమారు మూడేళ్ల కిందట బలవన్మరణం చెందినట్లు సహచరులు చెప్తున్నారు.

అప్పుల బాధతో చేనేత కార్మికురాలి బలవన్మరణం

చీరాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధలు తాళలేక చేనేత కార్మికురాలు బలవన్మరణం చెందారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ముత్యాలమ్మపేటకు చెందిన ముత్య శ్యామలాదేవి(49) భర్త సుబ్బారావుతో కలిసి మగ్గం వర్క్ చేస్తుంటుంది. వీరికి ఇరువురు సంతానం. అయితే గతకొంత కాలంగా అప్పులబారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో ఆదివారం ఇంట్లోనే ఉరికి పాల్పడి బలవన్మరణం చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

అద్దంకి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ తిరునాళ్లకు వచ్చి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. చీమకుర్తి మండలం చంద్రపాడుకు చెందిన సునీల్, నాగేశ్వరరావు బుల్లెట్‌పై శింగరకొండ తిరునాళ్లకు వచ్చి తిరిగి వెళ్తుండగా శనివారం వేకువజామున మేదరమెట్ల రోడ్డులో బలరామకృష్ణాపురం సమీపంలో గుర్తుతెలియని బైకు బుల్లెట్‌ను ఢీకొట్టడంతో వెనుక కూర్చున్న నాగేశ్వరరావు రోడ్డుపై పడిపోయాడు. అతడిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు అద్దంకి పోలీసులు కేసు నమోదు చేశారు.


ద్విచక్రవాహనదారులకు గాయాలు

మేదరమెట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో ముందు వెళ్తున్న వాహనాన్ని ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం తిమ్మనపాలెం మేదరమెట్ల మధ్య ప్రకాశం జిల్లా హెచ్‌ఎంపాడు మండలానికి చెందిన కుమ్మరి అశోక్ కుమార్ ద్విచక్రవాహనంపై మేదరమెట్ల వైపువస్తూ ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్నాడు. అశోక్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఆక్రమణలు తొలగించండి

చీరాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని 31వ వార్డులో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకోవాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అద్దె నివాసాల్లో ఎంతోమంది మగ్గుతుంటే కొందరు ఇష్టారీతిగా ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు వివరించారు. సమీపంలో ఏర్పాటు చేయనున్న ఎస్టీపీ పాకలంట్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి ఎస్.బాబూరావు, సీపీఐ నాయకులు ఎం.వెంకటరావు, చీరాల సాధన సమితి ప్రతినిధులు శీలం రవికుమార్, బాబూరావు, వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్స్ సంఘం నాయకులు రామారావు, హరిహరరావు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి



- గోవిందా.. గోవిందా.., జైరంగా... జైజై రంగా.. భక్తుల నామస్మరణ
- వైభవంగా రంగనాథుడి రథోత్సవం
- ప్రవాహంలా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన నగర వీధులు
- ఆకట్టుకున్న ఎదురుకోలు ఉత్సవం
- నేత్రానందంగా తెప్పోత్సవం

దీవించయ్యా... తల్పగిరీశా!





రథంపై ఆసీనులైన స్వామి, అమ్మవార్లు



ఆదివారం ఉదయం నగర వీధుల్లో సాగుతున్న రంగనాథుడి రథం

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు ప్రవహంలా తరలివచ్చారు. దీంతో నగర వీధులు కిక్కిరిశాయి. గోవిందా.... గోవిందా... జైరంగా... జైజై రంగా.. అంటూ భక్తులు నినాదాలు చేస్తూ రథం లాగారు. తొలుత ఆలయంలో శ్రీదేవి,భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, కేరళ, తీన్‌మార్ వాయిద్యాల మధ్య రథం వరకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు చేశాక విశేష పూజలు చేసి, గుమ్మడికాయ, టెంకాయలు కొట్టి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మంత్రి నారాయణ కుటుంబ సభ్యులు, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నగర డీఎస్పీ సింధుప్రియ, ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు రథో త్సవాన్ని ప్రారంభించారు. శ్రీవారి తేరు తొలుత గొల్లవీధి (తూర్పు వీధి) మీదుగా రైల్వేట్రాక్ వరకు వెళ్లి తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. అనంతరం ఆలయం నుంచి సంతపేటలోని నాలుగుకాళ్ల మండపం వరకు కొనసాగింది.



సంతపేట నాలుకాళ్ల మండపం వద్ద జరిగిన ఎదురుకోలు ఉత్సవం

నేత్రానందంగా ఎదురుకోలు ఉత్సవం

ఈ సందర్భంగా నిర్వహించిన ఎదురుకోలు ఉత్సవం నేత్రనందంగా సాగింది. వేదగిరి లక్ష్మీనర సింహస్వామి, ఉభయదేవే రులతో కలిసి నరసింహ కొండ దిగి తప్పెట్లు, తాళాలతో ఊరే గింపుగా వచ్చి ములుముడి బస్టాండ్ వద్ద విడిది చేశారు. రంగనాథుడు కూడా తన దేవేరులతో రథంపై సంతపేట నాలుగు కాళ్ల మండపం వద్దకు వచ్చారు. ఆ సమయంలో నరసింహ స్వామి తరపున రంగనాథస్వామికి, రంగనాథ స్వామి తరపున నర సింహస్వామికి పట్టువ స్త్రాలు అర్చకస్వాములు ఇచ్చి పుచ్చుకుంటారు. ఈ కార్యక్రమానికి ముందు గత రాత్రి రంగనాథుడికి కల్యాణానికి తనను ఆహ్వానించలేదని నర సింహ స్వామి రథం వరకు వచ్చి అలిగి వెను దిరుగుతారు. అనంతరం రంగనాథస్వామి బతిమా లాడడం.. వంటి సంవాద కార్యక్రమాన్ని అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమాన్ని వేలాది మంది తిలకించి, పులకరించి పోయా రు. నరసిం హస్వామి తరపున రంగ నాథుడికి పట్టువస్త్రాలు, ప్రసాదాలను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి సతీమణి సుజితమ్మ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, ఉభయకర్తలు కొండేటి వెంకటేశ్వర్లురెడ్డి, శివారెడ్డి, ఆలయ ఈవో వేమూరు గోపి తదితరులు అందచేశారు.

రథం లాగిన కమిషనర్

కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ రంగనాథుడి రథం లాగారు. రథోత్సవం ముగిసేవరకు ఆయన అక్కడే ఉండి హెల్త్ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లతో పారిశుధ్య కార్యక్రమాన్ని 100కి నూరు శాతం నిర్వహించేందుకు కృషి చేశారు. కాగా నగర డీఎస్పీ సింధుప్రియ రథోత్సవం సందర్భంగా క్యూలైన్లు, రోప్‌పార్టీ, ట్రాఫిక్, శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

నేత్రనందంగా తెప్పోత్సవం

నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి పుష్కరిణిలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత నరసింహస్వామి, రుక్మిణీ,సత్యభామ సమేత వేణు గోపాలస్వామి తెప్పోత్సవం నేత్రానందంగా సాగింది. ఈ సందర్భంగా కోనేరు వద్ద ఏర్పాటు చేసిన భారీ విద్యుద్దీపాలం కరణ, పూలాలంకర ణలు ఆకట్టుకున్నాయి. రంగనాథస్వామి రథోత్సవానికి తరలివచ్చిన వేదగిరి నరసింహస్వామి దంపతులకు సాయం సంధ్యవేళ మూలాపేట వేణుగోపాలస్వామి ఆతిధ్యం ఇచ్చేక్రమంలో ఈ ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మజ్జిగ చంద్రమౌళీరెడ్డి,ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు, వేదగిరి నరసింహస్వామి ఆలయ ఈవో వేమూరి గోపి, పెద్దసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మూలాపేట కోనేరులో ఆదివారం రాత్రి నిర్వహించిన నరసింహస్వామి, వేణుగోపాలస్వామి తెప్పోత్సవం

పొట్టిశ్రీరాముల త్యాగాలు అజరామరం

- ఆ మహనీయుడి స్ఫూర్తితో ముందుకు సాగాలి
- జయంతి సందర్భంగా కలెక్టర్



నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం వాడవాడలా అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నాయ కులు, అధికారులు, అభిమానులు పూలమాలు వేసి నివా ళులు అర్పించారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ ఓ.ఆనంద్, ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ పుష్పమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు త్యాగాలు అజరామరం అని అన్నారు. దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడు ఆయన అని పేర్కొన్నారు. ఆ మహనీయుడి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖాధికారి వెంకటలక్ష్మి, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్ఐవో, సిబ్బంది

స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రంలో...

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్రం కోసం అసువులు బాసిన ధన్యజీవి పొట్టి శ్రీరాములు అని ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు అన్నారు. నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రంలో ఆదివారం పొట్టిశ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. పొట్టిశ్రీరాములు చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'టెన్'షన్ వద్దు... !

- ప్రశాంతంగా రాయండి
- నేటి నుంచి పదోతరగతి పరీక్షలు
- 174 సెంటర్లలో నిర్వహణ
- సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- హాజరుకానున్న 33,434 మంది విద్యార్థులు
- ఓపెన్ స్కూలు పరీక్షలు కూడా నేటి నుంచే...

నెల్లూరు(విద్య), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు సోమవారం (నేటి) నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని అన్నీ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయడంతోపాటు ఏ విద్యార్థికీ కూడా అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. మాల్ ప్రాక్టీస్ నిరోధానికి చర్యలు చేపట్టడంతో పాటు అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై నిఘా ఉంచారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

ప్రశ్నపత్రంపై కోడ్

జంబ్లింగ్ విధానంలో జరిగే ఈ పరీక్షల్లో ప్రశ్నపత్రంపై కోడ్ అమలు చేస్తున్నారు. ఇందువల్ల ప్రశ్న పత్రం లీక్ అయ్యే అవకాశం ఉండదని, ఏదైనా తప్పు జరిగినా ఎక్కడ జరిగిందో క్షణాల్లో తెలిసిపోతుందని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పద్ధతిని ప్రవేశపెట్టింది. ప్రతి విద్యార్థి ప్రశ్న పత్రంలో బార్‌కోడింగ్ ఉంటుందని, దీన్ని స్కాన్ చేస్తే ఏ విద్యార్థికి అందించాం, ఏ సెంటర్‌లో ప్రశ్నపత్రం ఉందన్న విషయాలతోపాటు పూర్తి వివరాలు బయ టకు వచ్చేస్తాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.245 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నారు. అరగంటముందే విద్యార్థులు కేంద్రం వద్దకు చేరుకోవాలి. అత్యవసర పరిస్థితి, అనారోగ్య కారణాలేమైనా ఉంటే 5 నుంచి 10 నిమిషాలు వెసులుబాటు కల్పిస్తారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

కాగా సోమవారం నుంచే ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు డీఈవో తెలిపారు. జిల్లాలో ఆత్మకూరులో 6, కావలిలో 3, కందుకూరులో 4, కోవూరులో 2, నెల్లూరులో 4, వెంకటాచలంలో 2, ముత్తుకూరులో 1, కలువాయిలో 1, కేంద్ర కారాగారంలో ఒకటి కలిపి మొత్తం 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షకు 1597 మంది అభ్యాసకులు హాజరవుతున్నారన్నారు. పాఠశాలల్లో ఒంటిపూట బడులు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షలు నిర్వహిస్తున్న పాఠశాలల్లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తామని డీఈవో తెలిపారు.



సంగం జడ్పీ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో బాలాజీరావు

అర్ధగంట ముందే ప్రశ్నపత్రాలు

ప్రశ్నపత్రాలను 15 రూట్స్ ద్వారా పరీక్షకు 30 నిమిషాల ముందు మాత్రమే, ఆయా మండల కేంద్రాల నుంచి పోలీస్ బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలిస్తారు. జిల్లాలో 174 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యా ర్థులు నేలమీద కూర్చుని పరీక్ష రాయకుండా అన్నీ కేంద్రాల్లో బెంచీలను ఏర్పాటు చేశామని, పరీక్ష రాసే సమయంలో విద్యుత్ అసౌకర్యం కలగకుండా చూస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే తాగునీరు ఏర్పాటు చేయడంతో పాటు ఏఎన్ఎంలు కూడా మెడికల్ కిట్‌లతో అందు బాటులో ఉంటారని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌ను ఆర్టీసీ బస్సుల్లో చూపితే ఉచితంగా ప్రయాణించవచ్చునని అధికారులు తెలిపారు.

హాల్‌టికెట్ ఇవ్వకుంటే చర్యలు

ఫీజులు చెల్లించలేదని, మరే ఇతర కారణాలతో హాల్‌టికెట్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడితే సంబంధిత పాఠశాలలపై చర్యలు తప్పవని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు హెచ్చరించారు. ప్రభుత్వ యాప్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేసి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కూడా కల్పించిందన్నారు.



నగరంలోని టౌన్‌హాలు వినాయక ఆలయంలో హాల్‌టిక్కెట్లకు పూజలు చేయిస్తున్న విద్యార్థులు

33,434 మంది విద్యార్థుల సన్నద్ధం

జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ఈ ఏడాది 16,250 మంది బాలురు, 17,184 మంది బాలికలు కలిపి మొత్తం 33,434 మంది ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. జిల్లాలో మొత్తం 16 సమస్యాత్మక కేంద్రాల్లో, ఏడు కేంద్రాలు అతి సమస్యా త్మకంగా ఉన్నాయని గుర్తించి, అందులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

కాల్ సెంటర్ ఏర్పాటు

ఏవైనా సమస్యలు తెలియచేసేందుకు కంట్రోల్‌రూమ్ కూడా ఏర్పాటు చేశామని డీఈవో పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు వారి సమస్యలను తెలియచేసేందుకు 83414 08109 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పరీక్షలంటే పండుగే..

విద్యార్థులు పరీక్షలను పండుగలా జరుపుకోవాలి. ఏడాదంతా కష్టపడి చదివిన చదువుకు పరీక్షల రోజునే విద్యార్థికి మార్కుల రూపంలో గుర్తింపు లభిస్తుంది. ఉన్న స్థితి నుంచి తరగతి పెరగడం రూపంలో ఉన్నతస్థితికి చేరుకునే అవకాశం లభిస్తుందని విద్యావేత్తలు చెబుతున్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని వారు సూచిస్తున్నారు.

ధాన్యం ధరలు పతనం

- మిల్లర్లు, దళారుల కుమ్మక్కు
- నష్టపోతున్న అన్నదాతలు

అనంతసాగరం మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ధాన్యం ధరలు పతనమవుతుండడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. మిల్లరు, దళారులు కుమ్మక్కై ధరలను దిగజార్చుతున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో వారం నుంచి వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మొదట్లో 1638 (క్రాస్‌లు), 15048 (తెలంగాణ) రకాలు పుట్టి ధర రూ. 21వేలు వరకు పలికాయి. దీంతో రైతులు ఆనందపడ్డారు. అయితే రోజురోజుకు ధరలు పతనం అవుతుండగా వారి ఆనందం ఆవిరయింది. ప్రస్తుతం ఈ రెండు రకాలు రూ. 18 వేల నుంచి రూ.19 వేలకు మాత్రమే కొంటామని వ్యాపారులు తెగేసి చెబుతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే రైతులు నష్టపోవాల్సిందే. వరికోతలు జోరుగా సాగుతున్న తరుణంలో వాతావరణంలో మార్పువచ్చి వర్షం కురిస్తే, మరింతగా నష్టపోతామని రైతులు భావిస్తు న్నారు. ధాన్యాన్ని భద్రపరుచుకొనే వీలు లేక కల్లాల్లోనే తెగనమ్ముకోవాల్సిన వస్తున్నదని వారంటున్నారు. మిల్లర్లు, దళారులపై ప్రభుత్వం దృష్టి సారించి, ధాన్యం ధరలు తగ్గకుండా చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

అనంతసాగరం : ధాన్యం ఆరబెడుతున్న రైతులు



ఈతకెళ్లి బాలుడి మృతి

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో పెన్నాలో ఈతకెళ్లి నగరంలోని తడికలబజారు ప్రాంతానికి మహీధర్(14) మృతిచెందాడు. మహీధర్ ఆర్ ఎస్ఆర్ హైస్కూల్‌లో ఏడో తరగతి చదుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులు కిరణ్‌కుమార్, రోహన్‌కుమార్, సాయి, చరణ్‌తో కలిసి పెన్నాలో ఈతకొట్టేందుకు దిగాడు. ప్రవాహంలో మహీధర్ చిక్కుకుపోగా, ఇంతలో అక్కడకు చేరుకున్న అతని అన్న నందకిశోర్ రక్షించే ప్రయత్నం చేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో మహీధర్ నీటిలో గల్లంతై మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

న్యూస్ బాక్స్

అరటి పండ్ల లారీ బోల్తా

వలేటివారిపాలెం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):అత్తింటివారిపాలెం సమీపంలోని జాతీయ రహదారిలో ఆదివారం ఉదయం 6గంటల సమయంలో వేగంగా వెళ్తూ మలుపు వద్ద అదుపు తప్పి అరటికాయల లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనిల్‌కు తీవ్రంగా గాయపడ్డారు. వలేటి వారిపాలెం నుంచి కందుకూరు వైపు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గాయపడిన అనిల్‌ను 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మరిదినాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

కావలి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామమూర్తిపేట సాయిబాబు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ పర్యవేక్షణలో నెల్లూరు మోడరన్ ఐ ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన శిబిరంలో 360మందికి పరీక్షలు నిర్వహించి 70మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి ఆలయ కమిటీ పెద్దలు టంగుటూరి ప్రసాద్ సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, ప్రోగ్రాం కన్వీనర్ సునీల్, నరసింహారావు, ఓరుగంటి రామకృష్ణ, కోశాధికారి చక్రవర్తి, మంచికంటి మురళి, మధు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్

కావలి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే స్వచ్ఛాంధ్ర లక్ష్యం అని కెజీబీవీ జిల్లా డిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం స్థానిక ముసునూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. గ్రామ, పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ మానిట్‌అధికారి సుధీర్‌బాబు, ఆడపిల్లల సంరక్షణ అధికారిణి మమత, ప్రిన్సిపల్ సంధ్యారాణి పాల్గొన్నారు.

నేటి నుంచి బస్సు సౌకర్యం

కావలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి మద్దూరుపాడు టిడ్కో గృహ సముదాయానికి బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాడవాడలా పొట్టి శ్రీరాములుకు నివాళి

- ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

కందుకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే తలంపుతో తన ప్రాణాలను సహితం లెక్కచేయని మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కొనియాడారు. పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా జరపాలని ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆర్యవైశ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు తన్నీరు మల్లికార్జున, పిడికిటి వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసింహం, విశ్రాంత పంచాయతీ రాజ్ డీఈ వెంకట మురళీమోహన్ పాల్గొన్నారు.

- కావలి టౌన్: పట్టణ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ అధ్యక్షతన ట్రంకురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తివాసులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నేతలు ప్రొఫెసర్ సునీల్, ఓరుగంటి రామకృష్ణ, తిరివీధి ప్రసాద్, గాదంశెట్టి మధు, రమణయ్య పాల్గొన్నారు.
- టీడీపీ ఆధ్వర్యంలో ముసునూరులోని టీడీపీ కార్యాయంలో పట్టణ అధ్య క్షుడు గుత్తికొండ కిషోర్ అధ్య క్షతన జరిగిన కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, నేతలు జ్యోతి బాబురావు, కోట రమేష్, రామ కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పూడి నారాయణ అధ్యక్షతన నేతలు పాల్గొన్నారు..
- బీజేపీ నాయకులు ఏపీ జీఎస్టీ గ్రీవెన్స్ మెంబర్ అమరా సుబ్బారావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ప్రభాకర్‌నాయుడు ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభాకర్‌నాయుడు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు ఉన్నారు.
- అల్లూరు:స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌లతోపాటు ఎంపీడీఓ రజనీకాంత్, జడ్పీటీసీ వేణమ్మలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.
- తహసీల్దారు కార్యాలయంలో: డీటీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయరు శ్రీనివాసులు పాల్గొన్నారు.
- బిట్రగుంట: తహసీల్దారు సురేష్‌బాబు జువ్వలదిన్నెలోని పొట్టి శ్రీరాములు స్మారక భవనంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి సిబ్బందితో కలసి నివాళులర్పించారు.
- ఉలవపాడు: మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు బాపనపల్లి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పొన్నూరు రామాంజనేయులు, ఉప కార్యదర్శి దివ్యానంద గుప్తా, కమిటీ సభ్యులు వక్కలగడ్డ మణికంఠ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కందుకూరు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు


కావలి: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు


కావలి : పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు


అల్లూరు: నివాళులర్పిస్తున్న డీటీ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది


బిట్రగుంట: నివాళులర్పిస్తున్న తహసీల్దారు


ఉలవపాడు: నివాళుర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

టీడీపీలో చేరిక

కందుకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుర్రంవారిపాలెంకు చెందిన వైసీపీ నాయకులు తానికొండ శ్రీని వాసులు ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తానికొండ శ్రీనివాసులు గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొడపాటి నరసింహరావు, టెలికాం బోర్డు మెంబర్ గుర్రం మాల్యాద్రి, పిడికిటి వెంకటేశ్వర్లు, చడలవాడ కొండయ్య పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 23మంది లబ్ధిదారులకు రూ.19.42లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్రప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకి, శాసన సభ్యునికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

కందుకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దళితులు, బహుజనులకు రాజ్యాధికారం సాధనలో అంబేడ్కర్ కన్న కలలను నిజం చేసింది మాన్యశ్రీ కాన్షిరాం అని న్యాయవాది ముప్పవరపు కిషోర్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్థానిక వెంగమాంబ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్షీరాం జయంతి వేడుకలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బెజవాడ కొండయ్య, గేరా చిరంజీవి, పాలేటి కోటేశ్వరరావు, బీ.వెంకటేశ్వర్లు, యాదవ జేఏసీ మిరియం శ్రీనివాసులు, ఎండ్లూరి బాలు ఉన్నారు.

శ్రీవారికి అశ్వవాహన సేవ

కావలి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కచ్చేరిమిట్టలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు అన్నవరం సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు బుర్రా శేషాచార్యులు అర్చక బృందం ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. ఆదివారం ఉదయం హోమం, వసంతోత్సవం జరిగింది. సాయంత్రం శ్రీవారు అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తజనం అడుగడునా శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి చేపట్టిన ధ్వజాఅవరోహణలో ఆలయ కమిటీ పెద్దలు తిరివీధి బ్రహ్మయ్య, తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమకుమార్, నరహరి హరిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో తిరివీధి ప్రసాద్ ఉభయకర్తగా భక్తులకు అన్నసంతర్పణ చేపడతారు.



పేదలకు దుస్తుల పంపిణీ

కావలి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) పవిత్ర రంజాన్‌మాసంలో పేద మహిళలకు వస్త్రదానం చేయడం అభినందనీయం అని రెండవ పట్టణ సీఐ గిరిబాబు అన్నారు. హ్యాపీ సేవా సంస్థ పర్యవేక్షణలో ఒకటో పట్టణ ఎస్‌ఐ జమాల్‌వలి సతీమణి దివంగత హమీదున్నీసా జ్ఞాపకార్థం వెంగళరావునగర్‌లోని ఆయన నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలు తువ్వాళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖాదర్‌బాష, దేవరకొండ విజయ్, ప్రసాదరావు, నాగరాజు పాల్గొన్నారు.


మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సీఐ గిరిబాబు, ఎస్‌ఐ జమాల్‌వలి

పోలేరమ్మకు పొంగళ్లు

కావలి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డులో వెలసిన పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, పొంగళ్లు సమర్పించారు. మూడు రోజులపాటు నిర్వహించే తిరునాళ్లను అత్యంత వైభవంగా చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సంతర్పణ గావించారు. రాత్రి అమ్మవారిని మృగరాజు వాహ నంపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించి అమ్మవారిని దర్శించుకున్నారు.

రాజుపాలెం- ఇస్కపల్లి రోడ్డుకు త్వరలో మోక్షం

- సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్

అల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు ఎంతకాలంగా ఎదురుచూస్తున్న రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డుకు మోక్షం కలుగనుందని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే ప్రజలు ఇస్కపల్లి నుంచి అల్లూరు మీదుగా నెల్లూరు వైపునకు ప్రయాణం సాగించేందుకు ఎన్నో కష్టాలు పడుతున్నారని మరో పది రోజుల్లో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెప్పారు. అలాగే తాగునీటి సమస్య, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ, విద్యాశాఖ, హౌసింగ్ శాఖల అధికారులు తమ నివేదికలను సభ ముందుంచగా వాటిపై పలు వివరాలును అడిగి తెలుసుకున్నారు. త్వరలో సమస్యలకు పరిష్కారాలను చూపించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేణమ్మ, ఎంపీడీఓ రజనీకాంత్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో మాట్లాడుతున్న బీద గిరిధర్, చిత్రంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, ఎంపీడీవో రజనీకాంత్

వింజమూరులో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలి

వింజమూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కస్తూర్బాగాంధీ మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఆల్‌ఇన్‌ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ మెంబరు ఎల్.రాజేష్ వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని పెద్ద మండలం వింజమూరు అని నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మోడల్ స్కూల్స్ ఉన్నాయని, వింజమూరు మండలంలో ఇప్పటివరకు లేదని నిరుపేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

భగవద్గీతపై ప్రచారం

ఉదయగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవవీధిలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో దుత్తలూరు కమిటీ సభ్యులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాబోయే ఉగాది పర్వదినం యొక్క విశిష్టతను ప్రజలకు శాస్త్రోక్తంగా వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు సుధాకర్, వెంకటేశ్వరరెడ్డి, ప్రేమ్‌కుమార్, సంతోష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో బోరు ఏర్పాటు

వింజమూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):స్థానిక జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో ఉదయగి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు సర్పంచ్ నల్లగొండ్ల సృజన ఆదివారం తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్య ఉందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకరావడంతో ఆయన స్పందించి కార్యదర్శికి ఆదేశించడంతో బోర్‌ను ఏర్పాటు చేశారు. వేసవికాలంలో తాగునీటి సమస్య రాకుండా అవసరమైతే వివిధ ప్రాంతాల్లో బోర్లు వేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం

ఆత్మకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని ఆత్మకూరు బ్రేక్ ఇన్స్‌స్పెక్టర్ రాములు పేర్కొన్నారు. ఆదివారం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

- సంగం : సంగంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గునుపూడి గిరి, వేమా మల్లికార్జున, రాజా, గోపీ, ప్రభాకర్, మెంటా శ్రీధర్ పాల్గొన్నారు.
- అనంతసాగరం : స్థానిక గ్రంథాలయంలో అమరజీవి శ్రీపొట్టిశ్రీరా ములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు నారాయణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.
- వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : వింజమూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- దుత్తలూరు(ఉదయగిరి), (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సందానీ, సర్వేయర్ శివ, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రేక్ ఇన్స్‌స్పెక్టర్ రాములు


సంగం : అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళలు అర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నా నది ఒడ్డున వెలసి ఉన్న పురాతన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నా అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


నాగారపమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా గురుకులం వార్షికోత్సవం

ఆత్మకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీఆర్ గురుకుల పాఠశాలలో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిత్య అన్నదాత కంచి పరమేశ్వరరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల కోరిక మేరకు పాఠశాలలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ తరపున సరస్వతి విగ్రహానికి మండపం నిర్మిస్తానని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ గంగాధర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కంచి పరమేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న గురుకులం ఉపాధ్యాయులు

వైభవంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఉదయగిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన పోతురాజు గంగమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా వేదపండితుల వేదమంత్రోచ్ఛరణాల మధ్య ప్రాతఃకాల పూజ, ప్రతిష్ఠ హోమం, శాంతి పౌష్టిక హోమలు, గర్తపూజ, యంత్ర, విగ్రహ, ప్రాణ, గోపుర, శిఖర ప్రతిష్ఠలు, మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు అమ్మవారి వాహనం వెంట వారుకడవతో నీరు పోసి కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, ప్రాజెక్టు చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డిలు పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ఆలయ కమిటీ చైర్మన్ పాముల రమణయ్య ప్రత్యేక అభినందనలు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

అనంతసాగరం మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డిపాలెంకు చెందిన మల్లి నాగేశ్వరావు రోడ్డు ప్రమాదంలో, పీకేపాడుకు చెందిన తిరుపాల్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వారి పిల్లల చదుకు కోసం పీకేపాడుకు చెందిన హెల్పింగ్ హార్ట్ అసోసియేషన్ టీమ్ ముందుకు వచ్చి ఆదివారం రెండు కుటుబాలకు రూ.50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఆర్ వెంకటరమణారెడ్డి, కే పెంచలయ్య, బీ మురళి, హరి, లాయర్ చిన్నయ్య, ఈర్ల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందచేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడాలి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సీఐడీ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడి నష్టపోయిన డిపాజిటర్లకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య డిమాండు చేశారు. ఆదివారం తూర్పుబోయమడగల, వరికుంటపాడు, జడదేవి గ్రామాల్లో నిర్వహించిన ప్రజా చైతన్యయాత్రలో ఆయన మాట్లాడారు. ఆ భూముల్లోని జామాయిల్‌ను యథేచ్ఛగా నరికి తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తుండడం దారుణమన్నారు. భూములను పరిశీలించేందుకు వచ్చిన సీపీఐ నాయకులపై కొంతమంది దాడికి పాల్పడడం హేయమైన చర్యన్నారు. తమకేమి తెలియదని చెప్పే పాలకులు లారీలను అడ్డుకొని విచారణ చేయిస్తే వాస్తవాలు బయటపడతాయన్నారు. అలాగే మెట్ట ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించే గండిపాళెం జలాశయం పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందేలా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేయాలన్నారు. 75వేల ఎకరాలకు సాగునీరు అందించేలా పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుని వలసలను నివారించాలన్నారు. సీతారామ్‌సాగర్, మర్రివాట్ల రిజర్వాయర్ల పనులను సైతం వేగవంతం చేసేందుకు పాలకులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోడె రమణయ్య, వెంకటసుబ్బయ్య, వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకులు వెంకటయ్య

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

సీతారామపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అయ్యవారిపల్లి పంచాయతీలో రూ.10లక్షలతో, మారంరెడ్డి పంచాయతీలోని గంధంవారిపల్లిలో రూ.5లక్షలతో, సీతారామపురం పంచాయతీలో రూ.15 లక్షలతో మండల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి మాట్లాడారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసి దుగ్గిరెడ్డి గురువారెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ పాలగిరి అల్లూరురాజు, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్ , బాలినేని మాబయ్యలకిడి బ్రహయ్య పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

ఉదయగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. ఆదివారం సెయింట్‌మేరీ పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ ఉన్నత, సెయిం ట్ మేరీ, హోలీ ఏంజల్స్, గండిపాళెం గురుకుల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 529, ఓపెన్ స్కూల్ విద్యార్థులు 120 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

- దుత్తలూరులో: నందిపాడు, దుత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత, ఆదర్శ పాఠశాలల్లో పది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో వెంగయ్య తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో 469 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.
- వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): స్థానిక ఉన్నత పాఠశాల కేంద్రంలోని పదో తరగతి పరీక్షలకు సంబంధించి సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో రమణయ్య తెలిపారు. వరికుంటపాడు, జడదేవి, తిమ్మారెడ్డిపల్లి, కాకొల్లువారిపల్లి, తూర్పురొంపిదొడ్ల పాఠశాలలకు చెందిన 160మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. అలాగే విరువూరు, నార్త్‌కొండాయపాళెం, పెద్దిరెడ్డిపల్లి పాఠశాలలకు చెందిన మరో 77 మంది, ఉదయగిరి మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలకు వెళ్లాల్సి ఉందన్నారు. కాగా స్థానిక కేంద్రంలో చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా రమాదేవి, చలపతి వ్యవహరిస్తారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.